

మరిన్ని కథనాల
కోసం
యూట్యూబ్‌లో
ప్రసారమవుతున్న
మీ
SREECHAKRA
NewsTVని
వీక్షించవచ్చు.
ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్,



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY








సంపుటి 10 | సంచిక 28 | కర్నూలు | గురువారం 20 ఫిబ్రవరి 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi


# ఢిల్లీకి సీఎం చంద్రబాబు..

## కీలక నేతలతో భేటీ



ఢిల్లీ (శ్రీచక్ర) కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో నేడు రాత్రి ఢిల్లీ చేరుకోనున్న ముఖ్యమంత్రి.. అక్కడ కేంద్ర మంత్రులతో కీలక భేటీలు నిర్వహించనున్నారు. ఈ భేటీలలో హోంమంత్రి అమిత్ షా, కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్, కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో చంద్రబాబు భేటీ అయ్యే ఛాన్సుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హోంమంత్రి అమిత్ షాతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించి పలు ప్రాజెక్టులపై, అలాగే ఇతర సాయంపై చర్చించనున్నారు.ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి కేంద్ర సహాయం పొందేందుకు ఈ భేటీ ఎంతో కీలకంగా మారనుంది. రాష్ట్రంలో జరుగుతున్న పలు ప్రాజెక్టులను వేగవంతంగా అమలు చేసేందుకు నిధుల విడుదల చేయాలని అమిత్ షాతో ముఖ్యమంత్రి సమాలోచనలు చేయనున్నారు. దీంతోపాటు ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ కానున్నారు. ఈ భేటీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నిధుల విడుదల అంశంపై చర్చ జరగనుంది. ముఖ్యంగా ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలను 17,500 క్యూసెక్కుల నీటి తరలింపు సామర్థ్యంతో నిర్మించేందుకు అవసరమైన ఆర్థిక సాయంపై అభ్యర్థన చేయనున్నారు.ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కూడా భేటీ కానున్నారు. ఈ భేటీలో ముఖ్యంగా మిర్చి రైతుల సమస్యలపై చర్చ జరగనుంది. ఇటీవల మిర్చి ధర పతనం కారణంగా ఆ రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి ఈ సమస్యపై కేంద్రం నుంచి సాయం కోరనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఇప్పటికే పలు మార్లు కేంద్రానికి లేఖలు రాసి, రైతులకు సరైన ధరలు, ప్రోత్సాహకాలు అందించాలని కోరారు.ఈ సమావేశాలు ముగించుకున్న తర్వాత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 20వ తేదీ రాత్రి తిరిగి అమరావతికి చేరుకోనున్నారు.





## ప్రమాణస్వీకారం..!

(న్యూఢిల్లీ-(శ్రీచక్ర) : ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తాను ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాసనసభాపక్షం సమావేశాన్ని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో సీఎల్పీ లీడర్‌గా ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. ఆమె గురువారం మధ్యాహ్నం 12.35 గంటలకు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందిన విషయం తెలిసిందే. 70 అసెంబ్లీ స్థానాల్లో 48 చోట్ల బీజేపీ విజయం సాధించింది. ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 స్థానాలకే పరిమితమైంది. ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సైతం ఓడిపోయిన విషయం తెలిసిందే. చాలా సంవత్సరాల తర్వాత ఢిల్లీలో అధికారంలోకి రాగా.. ముఖ్యమంత్రి పదవి కోసం కీలక నేతలు పోటీపడ్డారు. పర్వేష్ వర్మ సైతం ముఖ్యమంత్రి రేసులో నిలిచారు. అలాగే, జితేంద్ర మహాజన్ సైతం ముఖ్యమంత్రి పదవి కోసం పోటీపడ్డారు. ఇక చివరకు సామాజిక సమీకరణలు, ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధం ఉన్న బినోయ్ సామాజిక వర్గానికి చెందిన రేఖ గుప్తా వైపు అధిష్టానం మొగ్గు చూపినట్లు సమాచారం. డిప్యూటీ సీఎంగా ప్రవేశ్ వర్మ, విజేంద్ర గుప్తాను అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నుకోనున్నట్లు సమాచారం రేఖాగుప్తా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో షాలిమార్ బాగ్ అసెంబ్లీ స్థానం గెలుపొందారు. ఆమె గతంలో ఢిల్లీ మేయర్‌గా పోటీ చేశారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రెసిడెంట్‌గా కొనసాగారు. ఢిల్లీ పీతంపురా కౌన్సిలర్.. ఆ తర్వాత మేయర్‌గా పని చేశారు. రేఖాగుప్తా ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలిసారే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించబోతున్నారు. గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా పని చేసిన అనుభవం లేకపోయినా.. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నది. విద్యార్థి నాయకురాలిగా రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టి.. సీఎం స్థాయి వరకు ఎదిగారు. విద్యార్థి దశలో ఏబీవీపీలో చురుకుగ్గా వ్యవహరించారు. పితంపుర కౌన్సిలర్‌గా, షాలీమార్ బాగ్-బీ కార్పొరేటర్‌గా పని చేశారు. షాలీమార్ బాగ్ నియోజకవర్గం నుంచి 2015, 2020 ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి.. ఆప్‌కు చెందిన బందనాకుమారి చేతిలో పరాజయం పాలయ్యారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో బందనకుమారిని 29వేల ఓట్లకుపైగా తేడా ఓడించి అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు.రేఖా గుప్తా ప్రస్తుతం ఢిల్లీ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, బీజేపీ మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా సేవలందిస్తున్నారు. ఆమె 1974లో హర్యానాలోని జింద్ జిల్లాలోని నంద్‌గఢ్ గ్రామంలో జన్మించారు. ఆమె తండ్రి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి. రేఖ కుటుంబం 1976లో ఢిల్లీకి మకాం మార్చింది. రేఖ ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య ఢిల్లీలోనే పూర్తి చేశారు. బాల్యంలోనే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఖీూ) విద్యార్థి విభాగం ఏబీవీపీలో చేరారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చదువుతున్న సమయంలో.. ఆమె దౌలత్ రామ్ కళాశాలలో కార్యదర్శి ఎన్నికల్లో గెలుపొందారు. 1995?96లో ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. రేఖగుప్తా ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. 2003-04లో ఆమె బీజేపీ యువ మోర్చా ఢిల్లీ యూనిట్‌లో చేరి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2004 నుంచి 2006 వరకు బీజేపీ యువ మోర్చా జాతీయ కార్యదర్శిగా సేవలందించారు. 2007 ఉత్తర పితంపుర కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. 2009 వరకు డీఎంసీలో మహిళా సంక్షేమం, శిశు అభివృద్ధి కమిటీకి చైర్‌పర్సన్‌గా పని చేశారు. ఇక 2009లో ఢిల్లీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా, 2010లో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించారు. 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో షాలిమార్ బాగ్ స్థానం పోటీ చేసి ఓడిపోయారు

# టెక్నాలజీ అభివృద్ధి చెందినా.. ఏఐ వచ్చినా.. మనల్ని నడిపేది దేవుడే

తిరుపతి, ఫిబ్రవరి 19(శ్రీచక్ర) : టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా.. ఏఐ వచ్చినా మనల్ని నడిపేది మాత్రం దేవుడేనని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. తిరుపతి వేదికగా జరుగుతోన్న ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పోలో బుధవారం మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తిరుమలలో అన్నదానం ప్రారంభించారని.. సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రాణ దానము ప్రారంభించారని గుర్తు చేశారు.పిల్లలకు ఫోన్లు ఐపాడ్‌లు ఇచ్చి పుస్తకాలకు దూరం చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తన కుమారుడు దేవాన్ష్‌కు మాత్రం సెల్ ఫోన్ ఇవ్వడం లేదని.. దేవుడు పుస్తకాలు ఇస్తున్నామన్నారు. మన దేవుళ్ల గురించి మన పిల్లలకు చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందని స్పష్టం చేశారు. దేశ ప్రధాని వసుధైక కుటుంబం గురించి ఇచ్చిన పిలుపు ఆదర్శప్రాయమైనదని అభివర్ణించారు. అందరూ కలిసి మన సంస్కృతిని కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయితే వాట్సప్ ద్వారా ఆలయాల్లో



సేవలు పొందేలా ఏపీలో సేవలు ప్రారంభించామని మంత్రి నారా లోకేష్ వివరించారు. ఇక ఆలయాలు, ఆలయాల్లో పని చేసే ఉద్యోగుల జీవితాల్లో వెలుగుల కోసం చంద్రబాబు నాయుడు అనేక చర్యలు చేపట్టారన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న దేవాదాయ శాఖ మంత్రుల సమావేశంలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఆలయాల ఉన్నతి కోసం ఒకరి నుంచి ఒకరు నేర్చుకోవాలన్నారు

# మిర్చి రైతులు తమ గోడును చెప్పుకున్నారు: జగన్



అమరావతి(శ్రీచక్ర) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇన్నాళ్లూ మిర్చి రైతుల సమస్యలపై సమీక్ష కూడా చేయలేదని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. కనీసం మిర్చి రైతుల సమస్యలు కూడా తెలుసుకోలేదని విమర్శలు గుప్పిం చారు. గుంటూరు మిర్చి రైతులతో వైఎస్ జగన్ మాట్లాడి వాళ్ల కష్టాలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. తమ గోడు మిర్చి రైతులు చెప్పుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి మద్దతు.. రైతులకు అందించలేదని ధ్వజమెత్తారు. మిర్చి రైతుల అవస్థలు బాబుకు కనిపించడం లేదానని ప్రశ్నించారు. మిర్చి క్వింటాల్ కు కనీసం రూ. 11 వేలు కూడా రావడం లేదని, పంటను అమ్ముకోలేని దుస్థితిలో రైతులున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 20 క్వింటాళ్ల దిగుబడికి 10- 15 క్వింటాళ్లు కూడా రాలేదని చెప్పారు. తమ హయాంలో క్వింటాల్ రూ. 20 వేలు పలికిన మిర్చి ఇప్పుడు రూ.11 వేలు కూడా రావడం లేదని, దీంతో పాటు పంట దిగుబడి కూడా పడిపోయిందని ఆగ్రహించారు. మరోవైపు మద్ధతు ధర లేక మిర్చి రైతుల కష్టాలు పడుతున్నారని దుయ్యబట్టారు.

# మమతా వర్సెస్ పవన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19(శ్రీచక్ర) మహా కుంభమేళాను మృత్యు కుంభమేళాగా యూపీ ప్రభుత్వం మార్చిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ,యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పై ఫైర్ అయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడిన మమత యూపీ ప్రభుత్వం కుంభమేళా నిర్వహించడంలో విఫలమైందని విమర్శించారు. జనవరి 29వ తేదీన ప్రయోగ రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది భక్తులు మృతి చెందారు. 60 మంది గాయరు. గత శనివారం న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో కుంభమేళాకు వెళ్లే రైలు ఎక్కే క్రమంలో జరిగిన తొక్కిసలాటలో మరో 18 మంది మృత్యువాత పడ్డారు.కుంభమేళా అసెంబ్లీ వేదికగా పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. మహా కుంభమేళాను, యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం మృత్యుకుంభంగా మార్చి వేసిందని ఆరోపించారు. మృతుల సంఖ్యను తక్కువగా చూపించే ప్రయత్నం యూపీ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. ప్రజలు, మీడియా చేసే విమర్శలు నుంచి



తప్పించుకునేందుకు వందల మృత దేహాలను దాచి పెట్టారని ఆరోపించారు. మహా కుంభమేళాను తాను కూడా గౌరవిస్తానని, గంగా మాత అంటే ఎంతో గౌరవమని చెప్పుకొచ్చారు మమతా బెనర్జీ. అయితే యూపీ ప్రభుత్వం చేసిన ఏర్పాట్లను తీవ్రంగా తప్పుబట్టారు. యోగి సర్కార్ సరైన ఏర్పాట్లు చేయలేదని, చేసి ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదని మమత అభిప్రాయపడ్డారు. మహా కుంభమేళాలో వీఐపీ సంస్కృతి నడిచిందని, ధనికుల కోసం లక్ష డేరాలు, చక్కటి ఏర్పాట్లు చేశారన్నారు. అదే రీతిలో పేదలకు ఎందుకు ఏర్పాట్లు చేయలేదని యోగీ సర్కార్‌ను నిలదీశారు. పేద ప్రజలకు అవరమైన కనీస ఏర్పాట్లను యూపీ ప్రభుత్వం చేయలేదని, ఈ మహా కుంభమేళాను నిర్వహించడంలో ఎలాంటి ప్రణాళిక లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.మమత బెనర్జీ చేసిన కామెంట్స్‌పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. సనాతన ధర్మంపై కామెంట్స్ చేయడం నాయకులకు చాలా ఈజీ అయిపోయిందని మండిపడ్డారు. కోట్ల మంది విశ్వాసాలను దెబ్బతిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్ల మంది ఒక చోటకు చేరినప్పుడు చాలా సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. జరిగిన దుర్ఘటనలకు విచారం వ్యక్తం చేయాల్సిందే కానీ విమర్శలు సరికాదని సూచించారు.క

# సంపాదకీయం

## నివేదికలే కానీ.. అమలు ఎక్కడ

విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పరీక్షల కాలం వచ్చేసింది. ఒకవైపు పిల్లలకు పరీక్షల టెన్షన్ పెరుగుతుం టే, మరోవైపు వారి తల్లిదండ్రులలో మాత్రం టెన్షన్ రెండింతలవుతుంది. పిల్లల పరీక్షలతో పాటు, రాబోయే విద్యా సంవత్సరంలో ప్రత్యేకించి ప్రయివేట్ పాఠశాలల్లో చెల్లించాల్సిన ఫీజులపై ఆందోళనతో పేరెంట్స్ ఇప్పటి నుండే సతమతమవుతున్నారు. ఈ టెన్షన్లు ఏటా షరామామూలే అయినా ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్ర ణ కోసం ముందడుగు వేస్తుండడంతో పేరెంట్స్ కొంత ఆశాదృక్పథంతో ఉన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో అడ్డూ అదుపు లేని ఫీజుల కట్టడి కోసం విద్యా కమిషన్ చేసిన సిఫార్సులను చట్టం రూపంలో తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తుందనే వార్తలు కాస్త ఊరట కలిగిస్తున్నాయి. విజ్ఞానం, విలువల కంటే మార్కులకే ప్రాధాన్యితిస్తున్న ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో ప్రయివేట్ స్కూళ్లకు ఆదరణ పెరి గింది. తమ కంటే తమ పిల్లల భవిష్యత్ మరింత మెరుగ్గా ఉండాలని కోరుకునే తల్లిదండ్రులు, వారికి తామిచ్చే ప్రధానమైన ఆస్తి మంచిగా చదివించడమే అనే భావనతో ఎంత ఖర్చుకైనా వెనుకాడడం లేదు. ఈ బలహీనతను ఆసరాగా చేసుకొని కొన్ని ప్రయివేట్ పాఠశాలలు ముక్కుపిండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఘటనలు నిత్యం వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న సుమారు 11,500 ప్రయివేట్ స్కూళ్లల్లో ఫీజుల నియంత్రణ కోసం మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ 'తెలంగాణ ప్రయివేట్ అన్ఎయిడెడ్ స్కూల్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్లు–2025' పేరిట జనవరి 24న పలు సిఫా ర్సులతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ బిల్లును చట్టం చేయాలని ప్ర భుత్వ వర్గాలు యోచిస్తున్నట్టు వార్తలు రావడం స్వాగతించాల్సిన పరిణామం. మౌలిక వసతులు లేమితో ఇరుకైన భ వనాల్లో, క్రీడా ప్రాంగణాలు లేకుండా తరగతి గదుల్లో పరిమితికి మించి విద్యార్థుల తో బోధన సాగిస్తున్న ప్రయివేట్ పాఠశాలల్లో విద్యావ్యవస వ్యాపార వస్తువుగా మారిన నేపథ్యంలో ఈ కమిషన్ అనేక సూచనలు చేసింది. పే స్కూల్స్, టెక్నో స్కూల్స్, ఇంటర్నేషనల్, ఈ–టెక్నో, ఒలంపియాడ్ వంటి ఆకర్షణీయమైన పేర్లతో భారీగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలను కట్టడి చేయడానికి విద్యా కమిషన్ క్షేత్రస్థాయిలో పలు విద్యా సంస్థల యాజమాన్యాలతో, పేరెంట్స్ కమిటీలతో, విద్యావేత్తలతో, నిపుణులతో చర్చించడమే కాక, ఇతర రాష్ట్రాల్లోని విధి విధానాలను కూడా పరిశీలించి ప్రభుత్వానికి విలువైన సూచనలను అందించింది. రాష్ట్రంలోని ప్ర యివేట్ విద్యాసంస్థలు వాటి స్థాయిని బట్టి ఏడాదికి రూ.10 వేల నుండి రూ.20 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నట్టు ఈ కమిటీ దృష్టికి వచ్చింది. గతంలో ఫీజుల ని యంత్రణ కోసం ప్రభుత్వం జీవో జారీ చేసి నా న్యాయపరమైన సమస్యలతో ప్రక్రియ ఆగిపోవడంతో ప్రయివేట్ పాఠశాలల ఆగడాలకు అంతే లేకుండా పోయిందని, గతం లో తిరుపతిరావు కమిటీ సిఫార్సులను ప్ర యివేట్ పాఠశాలలు తుంగలో తొక్కుతున్నా పర్యవేక్షణ కరువైందని, విద్యా కమిటీని బంధనలను విద్యా సంస్థలు అటకెక్కించినా అడిగే నాథుడే లేరని గుర్తించిన కమిషన్ ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేసింది. తెలంగాణలో ప్రయివేట్ పాఠశాలలు అధికంగా వసూలు చేస్తున్న ఫీజుల ని యంత్రణకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ఒక రెగ్యులేటరీ కమిషన్, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక రెగ్యులేటరీ కమిషన్లు ఏర్పాటు చేసి వాటికి చట్టబద్ధత కల్పించాలనే ప్రధానమై న సిఫార్సు చేసింది. రాష్ట్ర స్థాయి కమిషన్ చైర్మన్‌గా సుప్రీం కోర్టు/హై కోర్టు రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని నియమించాలని చెప్పింది. పాఠశాల యాజమా న్యాల ప్రతినిధులను, రిటైర్డ్ ప్రొఫెసర్లను, విద్యావేత్తలను, విద్యా శాఖలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉన్నతాధికారిని, ఒక చార్టెర్డ్ అకౌంటెంట్‌ను సభ్యులుగా నియమించాలి. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల్లోని పాఠ శాలల ఫీజులను స్టేట్ ఫీజు రెగ్యులేటరీ కమిషన్, మిగత జిల్లాల్లో ఫీజుల ఖరారు కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో డీఎఫ్‌ఆర్‌సీ ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించాలని కమిషన్ చెప్పింది. ప్రయివేట్ పాఠశాలలను 5 కేటగిరీలు గా విభజించి, వాటికి వేర్వేరు ఫీజులు ఖ రారు చేయాలని కమిషన్ సూచించింది. ఆయా పాఠశాలలకు ఉన్న స్థలం, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, డైనింగ్ హా ళ్లు, క్రీడా స్థలం, ఇతర సౌకర్యాల ఆధారంగా కేటగిరీలు, ఫీజులు నిర్ధారించాలని కమిషన్ పేర్కొంది. ఖరారు చేసిన ఫీజుల వివ రాలను పాఠశాల వెబ్‌సైట్లలో పెట్టి అంతే తీసుకోవాలి. మేనేజ్‌మెంట్లు అడ్మిషన్ ఫీజులు వసూలు చేయకుండా, ట్యూషన్ ఫీజును మాత్రమే తీసుకోవాలని కీలకమైన సిఫార్సు చేసింది. ఎప్పటికప్పుడు ఫీజులకు సంబంధించిన ఆడిట్ నివేదికలను కూడా బహిర్గతం చేయాలని కమిషన్ కీలక సూచన చేసింది. నిర్దేశించిన ఫీజు కంటే అధికంగా వసూ లు చేసే విద్యా సంస్థలపై వెంటనే విచారణ జరిపి మొదటిసారి రూ.లక్ష జరిమానా వి ధించాలి. రెండోసారి ఆ సంస్థ నుండి అదే తప్పిదం అయినా మార్పు రాకపోతే ఆ పా ఠశాల అనుమతులను రద్దు చేయాలనే క ఠినమైన సిఫార్సులను కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. పాఠశాలలో ఉండే గ్రం థాలయం, ల్యాబ్స్, కంప్యూటర్ ల్యాబ్ సౌ కర్యాలతో పాటు టీచర్ల విద్యార్హతలు, పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాల నిర్వహణకు అయ్యే ఖర్చుల ఆ ధారంగా ఫీజులు ఉండాలని కమిషన్ స్ప ష్టం చేసింది. అధికంగా ఫీజులు వసూలు చేసే అంశమే కాకుండా విద్యా ప్రమాణాలను పరిరక్షించడం, ఉపాధ్యాయుల సా మర్థ్యం పెంపు, పాఠశాలలపై పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టడం, విద్యా హక్కు చట్టం అమలు వంటి అధికారాలను కూడా కమిటీలకు ఇవ్వాలని కమిషన్ సూచించింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రా ల్లో ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రయివేట్ పాఠశాలలపై సరైన నిఘా లేకపోవడంతో ఫీజులపై కట్టడి లేకుండా పో యింది. ఉదాహరణకు దేశంలోని ఒక ప్ర ముఖ విద్యా సంస్థ ఉత్తరాది రాష్ట్రాల్లో వ సూలు చేసే ఫీజుల కంటే, హైదరాబాద్‌లోని తమ ఫ్రాంచైజీలలో అధిక ఫీజులు వసూలు చేస్తోంది.

# ఆత్మహత్యలే శరణ్యం అంటున్నా అన్నదాతలు

**భారీగా తగ్గిన మిర్చి ధరలు, ఆందోళనలో అన్నదాతలు, పట్టించుకోని ప్రభుత్వాలు**
**కింటానికి 8000 వేల నుండి 11వేల రూపాయలు మాత్రమే కొనుగోలు చేశారని గుంటూరు మిర్చి మార్కెట్ యార్డులో కర్నూలు జిల్లా ప్రాంత వాసులు తీవ్ర ఆందోళన,**
**సూపర్ సిక్స్ పథకాలతో అన్నదాతలను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం,**
**భారీగా తగ్గిన మిర్చి ధరలతో అన్నదాతలు అభాసుపాలు,**







ఎమ్మిగనూరు,ఫిబ్రవరి,19 (శ్రీ చక్ర):– కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు, మంత్రాలయం,నందవరం, గోనెగండ్ల,పెద్దకడబ వార్,కోసిగి, కౌతాళం మండలాల్లో అత్యధికంగా మిర్చి పంటలను సాగు చేశారు. ఈసారి మిర్చి ధరలు భారీగా పతనం కావడంతో అన్నదాతలు ఆశలన్నీ నిరాశగానే మిగిలాయి. ఒక ఎకరాకు మిర్చి పంటకు లక్ష రూపాయలు నుండి రెండు లక్షల రూపాయల దాకా పెట్టుబడి పెట్టిన కూడా పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రావడం లేదంటూ అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరం మిర్చి ధరలు భారీగా పతనం కావడంతో పెట్టిన పెట్టుబడులకు కూడా డబ్బులు రావడం లేదంటూ అన్నదాతలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు పండించిన మిర్చి పంటను ఎక్కడున్నా రైతులు అమ్మకానికి వెళితే అక్కడ దళారీలు,కమిషన్ ఏజెంట్లు కుమ్మక్కై అన్నదాతలు పండించిన మిర్చి పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా ఒక క్వింటాలు కేవలం ఎనిమిది వేల రూపాయల నుండి 12 వేల రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతలు పండించిన మిర్చి పంటకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించకుండా కూటమి ప్రభుత్వం అన్నదాతను అగోసపాలు చేస్తున్నారని అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటకు టిడిపి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకుండా అన్నదాతలను కాపాడటంలో ప్రభుత్వాలు నిమ్మేక్కి నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయి అని రైతు సంఘం నాయకులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటను వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మబోతే హరివి, కొనబోతే కొరివి అన్న చందంగా గుంటూరు మార్కెట్ యార్డులో కమిషన్ ఏజెంట్లు, మార్కెట్ యార్డ్ దళారీలు వ్యవస్థ చాలా దారుణంగా ఉందని కర్నూలు జిల్లా మిర్చి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ వారు ఆడిందే ఆట,పాడిందే పాట అన్న చందంగా తయారైందని అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించకుండా అన్నదాతలను అగోషపాలు చేసి, కూటమి ప్రభుత్వంలో అన్నదాతల సమస్యలను పట్టించుకునే నాధుడే కరువయ్యాడని అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు అన్నదాతలు ఆత్మహత్య చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా భారీగా నష్టపోయిన మిర్చి పంటల రైతులను రాష్ట్ర ప్రభుత్వనీ ఆదుకునీ తక్షణ సహాయం క్రింద వెంటనే నష్టపరిహారాన్ని చెల్లించాలని కూటమి ప్రభుత్వాన్ని అన్నదాతలు మహిళలు, ప్రజా సంఘాల నాయకులు, రైతుకూలీ సంఘం నాయకులు కోరుతున్నారు. కర్నూలు జిల్లా ప్రాంతవాసులైన కె. దానప్ప, బి వీరేష్ తదితరులు విలేకరుల ముందు మాట్లాడుతూ ఈ సంవత్సరంలో కూటమి ప్రభుత్వం మిర్చి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా అన్నదాతలను అగోషపాలు చేసి పంట దిగుబడికి సరైన గిట్టుబాటు ధరలు లేక అప్పుల పాలైన రైతులమైన మేము తీవ్రంగా నష్టపోవడమే కాక కకావికలమావుతూ, ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు,మూడు సంవత్సరాల క్రితం నుండి మిర్చి క్వింటానికి 20 నుంచి 25 వేల రూపాయుల చొప్పున ఉండేదని కానీ ఈ సంవత్సరం మిర్చి పంట కనీస మద్దతు ధర సగానికి,సగం కూడా లేకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురి అవుతున్నామని తెలిపారు. గత సంవత్సర కాలంలోని మిర్చి పంట ఏసీ గోడౌన్లలో ఇప్పటికే మగ్గుతూనే ఉందని ఇప్పటివరకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఏసీ గోడౌన్లలోనే మగ్గుతూ ఏసి గోడౌన్ల బాడుగకు కూడా చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మిర్చి పంటకు సంబంధించి ఎకరాకి లక్ష నుంచి లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టడం జరిగిందని అయితే ఇప్పుడు ఉన్నటువంటి పరిస్థితుల్లో పెట్టుబడి పెట్టిన దాంట్లో ఇప్పుడున్న కనీసం మద్దతు ధరలకు సంబంధించి పెట్టుబడి కూడా రావడం లేదని అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా రైతుల పరిస్థితి చాలా దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్టిన పెట్టుబడికి సంబంధించిన లక్షలలో అప్పులు చేసుకున్న రైతులు ఉన్నామని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్పందించి ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంట ఆ కు కనీస గిట్టుబాటు ధరలను కల్పించి విదేశాలకు ఎక్స్పోర్టు ఇవ్వాలని ఆశిస్తున్నామని లేకపోతే మిర్చి రైతులందరూ కలిసి మాకు ఆత్మహత్యలేశరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎల్లప్ప,క్రిష్ణ,అయ్యన్న,రాముడు,ఉరుకుంద పాల్గొన్నారు.

# రీ సర్వే ఎస్ఓపి (స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్) ప్రకారం పొరపాట్లకు తావులేకుండా రీ సర్వే ప్రక్రియను చేయాలి


**×మ్యుటేషన్, ఎఫ్ లైన్ పిటిషన్ లను సక్రమంగా పరిష్కరించాలి**
**×అక్రమాలకు పాల్పడితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవు**
**×జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**





కర్నూలు, ఫిబ్రవరి 19 (శ్రీచక్ర): రీ సర్వే ఎస్ఓపి (స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్) ప్రకారం పొరపాట్లకు తావులేకుండా రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ రెవెన్యూ, సర్వే శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ నిర్వహణపై రెవెన్యూ మరియు సర్వే సిబ్బందికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ కింద ప్రతి మండలంలో ఒక గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద రీ సర్వే ప్రక్రియ జరుగుతోందన్నారు. రీ సర్వే కి సంబంధించిన ఎస్ఓపి (స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్)ను వీఆర్వో లు, సర్వేయర్ లు క్షుణ్ణంగా అవగాహన చేసుకొని రీ సర్వే ప్రక్రియ నిర్వహిస్తే పొరపాట్లకు ఆస్కారం ఉండదని కలెక్టర్ పేర్కొన్నారు.. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ నిర్వహణపై రెవెన్యూ మరియు సర్వే సిబ్బందికి డివిజన్ స్థాయిలో కూడా శిక్షణ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లను ఆదేశించారు. సచివాలయంలో ఉన్న మ్యుటేషన్, ఎఫ్ లైన్ పిటిషన్ లకు సంబంధించి అర్జీదారుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతోందన్నారు. ఐవిఆర్ఎస్ ద్వారా, సీసీఎల్ ఏ, కలెక్టరేట్ నుండి అర్జీ దారులకు ఫోన్ చేసి మీ సేవ ఫీజ్ కాకుండా అదనంగా డబ్బు చెల్లించారా, రీ సర్వే సమయంలో తహసీల్దార్లు ప్రజలకు నోటీసులు ఇస్తున్నారా? వీఆర్వోలు ఫీల్డ్ కి వచ్చి ఎంక్వైరీ చేశారా? అని ఫీడ్ బ్యాక్ ను సేకరించడం జరుగుతోందన్నారు..ఫీడ్ బ్యాక్ నెగెటివ్ గా ఉందని, ఈ అంశానికి సంబంధించి పొరపాట్లు చేసిన సిబ్బంది మీద చర్యలు తీసుకుంటున్నామన్నారు. మ్యుటేషన్, ఎఫ్ లైన్ అర్జీలను ప్రొసీజర్ ప్రకారం సక్రమంగా చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డబ్బు అడిగినా, నోటీసులు ఇవ్వక పోయినా, ఫీల్డ్ కు వెళ్ళకుండా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఒక ఆస్తి బదలాయింపు లో ఎన్నో జీవితాలు ఆధారపడి ఉంటాయని, ఈ ప్రక్రియ చేసేటపుడు అధికారులు చాలా జాగ్రత్తగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. యాంత్రికంగా చేయకూడదని, నియమ నిబంధనల ప్రకారం సర్వే ప్రక్రియను చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఎఫ్ లైన్ పిటిషన్ లకు సంబంధించి విలేజ్ సర్వేయర్ లు ప్రజలకు నోటీస్ లు ఇవ్వకుండా ఎఫ్ఎమ్బి లో అప్లోడ్ చేయకూడదన్నారు.. ఒకవేళ నోటీసులు ఇచ్చినా రాని పక్షంలో నోటీస్ లు సర్వ్ చేసిన ఫోటో, ఫీల్డ్ కి వెళ్లిన ఫోటో, స్టేట్మెంట్ రికార్డు చేసిన ఫోటోలను వెబ్ ల్యాండ్ లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిఓ ఎమ్ ఎస్ నెంబర్ 30 ప్రకారం అనధికారిక మరియు అభ్యంతరం లేని ఆక్రమణల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు..వెంటనే ఈ అంశంపై సర్వే నిర్వహించి, ఇలాంటి వారిచే ఆన్లైన్ లో దరఖాస్తులను చేయించాలన్నారు. ఈ అంశం పై విఆర్ఓ లకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ తహసీల్దార్ లను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలు, రీ సర్వే గ్రామ సభల్లో వచ్చిన అర్జీల పరిష్కారాన్ని బాగా చేశారని కలెక్టర్ తెలిపారు.. పిజిఆర్ఎస్ కి సంబంధించిన అర్జీలలో మాత్రం ఎండార్స్మెంట్ సరైన రీతిలో ఇవ్వడం లేదన్నారు. అర్జీ దారులు పదేపదే వచ్చినప్పటికీ వారి సమస్యను అర్థం చేసుకోకుండా ఉంటే ఎలా అని కలెక్టర్ తహసీల్దార్లను ప్రశ్నించారు..పరిష్కారంలో నాణ్యత ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆర్ ఎస్ ఆర్, అడంగల్, 1బి, ఎఫ్ఎంబి, రికార్డు ఆఫ్ రైట్స్ గురించి కలెక్టర్ క్షుణ్ణంగా వివరిస్తూ, వీటిపై రెవెన్యూ అధికారులకు పూర్తి అవగాహన చాలా అవసరమని కలెక్టర్ తెలిపారు..ఆర్ ఎస్ ఆర్, అడంగల్ లలో భూమి విస్తీర్ణం ఒకే విధంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హత ఉండి ఇంటి స్థలం లేని వారిని గుర్తించేందుకు విఆర్ఓ లు సర్వే చేయాలని, అందుకు సంబంధించిన గైడెన్స్ చదవాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య మాట్లాడుతూ మన జిల్లాలో పైలెట్ గ్రామాలుగా 25 గ్రామాలను ఎంపిక చేసుకుని రీ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ 25 గ్రామాలలో గ్రామ సరిహద్దులను ఏర్పాటు చేశామని, పత్తికొండ డివిజన్లో ఐదు గ్రామాల్లో బ్లాక్ బౌండరీ చేయలేదని, బ్లాక్ బౌండరీని రెండు రోజుల్లో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పత్తికొండ డిఐఎస్ఓ ను ఆదేశించారు. గ్రౌండ్ ట్రూతింగ్ లో చాలా వెనుకబడి ఉన్నామని, రోజు వారీ లక్ష్యాలను నిర్దేశించుకుని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ కు షెడ్యూల్ వేసుకోవాలని , అదేవిధంగా షెడ్యూల్ ప్రకారం రెండు లేక మూడు రోజులు ముందు రైతులకు నోటీసులు సర్వ్ చేయాలని, ఏ సర్వే నెంబర్లు ఎప్పుడు చేస్తామన్నది ముందుగానే తెలియజేయాలని జేసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, ఎడి సర్వే మునికన్నన్, అన్ని మండలాల తహసీల్దార్లు, వీఆర్వో, విలేజ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా గోశాలకు ఫ్యాన్లు అందించిన స్ఫూర్తి..



డోన్, :–ఫిబ్రవరి 19 కర్నూలు జిల్లా పెద్దటేకూరు గ్రామ శివారులో వెలసిన రుక్మిణీ సాహిత పాండురంగ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాండురంగ స్వామి గోశాల కు వేసవి కాలన్ని దృష్టిలో వుంచుకొని గోవులకు చల్లని గాలి వుండాలనే ఉద్దేశంతో స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో స్ఫూర్తి దాతల సహకారం ఫ్యాన్లను ఇప్పించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జన్మదిన సందర్భంగా ఈ ఫ్యాన్లు స్ఫూర్తి సభ్యులు పాండు రంగ స్వామి దేవస్థానం పీఠాధిపతి ఎల్లప్పస్వామికి అందించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ఎల్లప్ప స్వామి మాట్లాడుతూ గోమాత సకల దేవతలకు నిలయమని గోవులకు సేవా చేయడం చాల శుభకరమని వేసవి తాపం నుంచి గోమాతలను కాపాడడానికి మంచి ఫ్యాన్లు ఇచ్చిన స్ఫూర్తి దాతలకు, సేకరించిన స్ఫూర్తి సేవా సంస్థ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్ఫూర్తి సేవా సంస్థ అధ్యక్షులు స్ఫూర్తి మధు మాట్లాడుతూ స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో మేము సేవా కార్యక్రమాలకు చేయూతనిస్తున్న దాతలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. గోమాత సేవలో ప్రతి ఒక్కరు తరించాలని ఛత్రపతి శివాజీ మహారాజ్ జన్మదిన సందర్భంగా దాతలు ఇచ్చిన ఈ ఫ్యాన్లను దేవస్థానం సంస్థ సభ్యులు చంద్ర, భాస్కర్, మోహన్ రెడ్డి, నారాయణ స్వామి, మరియు వెల్దుర్తి హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు హరి సింహానాయుడు, వైద్యం రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వీధిలో పారిశుద్ధ్యం పకడ్బందీగా నిర్వహించాలి

## నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు

## పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రానీయొద్దు



కర్నూలు, ఫిబ్రవరి 19(శ్రీచక్ర): నగరంలో ప్రతి వీధి చివరి వరకు పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలోని ఆదిత్య నగర్, సంపత్ నగర్, గురు రాఘవేంద్ర నగర్, బిర్లా కాంపౌండ్, అలాగే వడ్డేగిరి కేవిఆర్ గార్డేన్స్ కాలనీ సమీపంలోని హంద్రీ నది పరివాహక ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య, జంగిల్ క్లియరెన్స్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జన నివాసాలతో పాటు సమీపంలో ఉన్న నదీ పరివాహక ప్రాంతాల్లో, ఖాళీ స్థలాలను సైతం శుభ్రంగా ఉంచాలని, పిచ్చి మొక్కలు ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. పారిశుద్ధ్యానికి సంబంధించి ప్రజల నుండి పదేపదే ఫిర్యాదులు రానీయొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఏఈ మహేష్, పారిశుద్ధ్య తనిఖీదారులు అనిల్ కుమార్, ఆంజనేయులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ అవసరం




కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (శ్రీ చక్ర ) : బాలికలకు ఆత్మ రక్షణ కోసం కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ ఎంతో అవసరమని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. నగరంలోని గాయత్రి ఎస్టేట్ లో జరిగిన కార్యక్రమంలో ఈ నెల 20, 21వ తేదీల్లో రాజమండ్రిలో జరగనున్న ఖేలో ఇండియా క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్తున్న 66 మంది ఉషు క్రీడాకారులకు ఆయన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమండ్రిలో జరిగే ఖేల్ ఇండియా క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన ఉషూ క్రీడాకారులు విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. సుదూర ప్రాంతాలకు వెళుతున్న బాలికలు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ పొందడం వల్ల ఆత్మరక్షణ, దేహదారుఢ్యం, ఆత్మస్థైర్యం, ఏకాగ్రత మెరుగుపడుతుందన్నారు. తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఆయన అభినందించారు. క్రీడల్లో సాధన చేయడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా జీవించవచ్చని ఆయన వెల్లడించారు. కర్నూలు నగరంలో క్రీడలను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం అందిస్తాన్నారు. ఈ కార్యక్రమంలో ఉషూ శిక్షకుడు టి.శ్రీనివాసులు పాల్గొన్నారు .

## శ్రీ మఠం హుండీ ఆదాయం రూ. 3.29 కోట్లు



మంత్రాలయం, ఫిబ్రవరి 19(శ్రీచక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఫిబ్రవరి నెల (28)రోజుల హుండీ ఆదాయం రూ. 3,29,15,105లు సమకూరినట్లు మఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు. బుధవారం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో హుండీ ఆదాయం లెక్కింపు ప్రక్రియ కొనసాగింది. హుండీ లెక్కింపులో 58.150మిల్లీ గ్రాముల బంగారం, 1280 గ్రాముల వెండిని భక్తులు హుండీలో కానుకులుగా సమర్పించుకున్నారని పేర్కొన్నారు. ఇంతటితో ఫిబ్రవరి నెల హుండీ ఆదాయం లెక్కింపు ప్రక్రియ పూర్తి అయినట్లు శ్రీ మఠం ఏఏఓ మాధవ శెట్టి , మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు.


# ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కావాలి -జయంతి వేడుకలో శ్రీ మఠం పీఠాధిపతులు







మంత్రాలయం, ఫిబ్రవరి 19(శ్రీచక్ర) :దేశంలోని ప్రతి హిందువులకు ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కావాలని శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు పిలుపునిచ్చారు. బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలో భాగంగా ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత దేశంలో ఛత్రపతి శివాజీ చరిత్ర ఒక ప్రత్యేక అధ్యాయమని హిందు ధర్మ పరిరక్షణకు కృషి చేసిన మహా వీరుడని కొనియాడారు. ప్రజా రంజకంగా రాజ్యాన్ని పరిపాలించి ఆధ్యాత్మికతను కలిగి రాఘవేంద్రస్వామి, ఆశిస్సులు పొందారని సాక్షాత్తు శ్రీ శక్తి మాత నుంచి ఖడ్గం పొందిన ధీరుడు అన్నారు. ఆయన యువతకు స్ఫూర్తి కావాలని కోరారు. మొదటి సారి యువత ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని చేయడం ఆనందంగా ఉందని శ్రీ మఠం నుండి సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించి బాణా సంచా పేల్చి సంబరాలతో శ్రీ రామ సర్కిల్, రాఘవేంద్ర కూడలి , ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఊరేగించి 101 కొబ్బరికాయాలు కొట్టారు. ఈ కార్యక్రమంలో జీనియస్ గ్లోబల్ స్కూల్, శ్రీ వైష్ణవి ఇంగ్లీషు మీడియం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్ రాఘవేంద్ర , వడ్డే నారాయణ , ,వీరారెడ్డి ,మంగళి వెంకటేష్ , కురువ మల్లికార్జున పేగుల రాము హండే భీమేష్ పవన్ కుమార్, రమేష్ వడ్డే శ్రీ రామ్, వడ్డే గురుప్రసాద్, హండే నీలకంఠ, చాకలి సునీల్ ఫణింద్ర చాకలి చక్రవర్తి, ప్రాణేష్, పులకుక్క రాము, హరి గౌడ్ బంగి వీరేష్ దాసప్ప గారి సుధర్మ తదితరులు పాల్గొన్నారు.

# బంగారమ్మవ్వ ను దర్శించుకున్న టిడిపి ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి





మంత్రాలయం , ఫిబ్రవరి 19(శ్రీచక్ర) : మంత్రాలయం మండల పరిధిలోని రచ్చుమరి గ్రామంలో వెలసిన బంగారమ్మవ్వ దేవర ను పురస్కరించుకొని మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి , వీరితో పాటు పల్లెపాడు రామిరెడ్డి , ముత్తురెడ్డి, యువ నాయకులు ఎన్ .రాకేష్ రెడ్డి లు బంగారమ్మవ్వ , దేవమ్మవ్వ లను బుధవారం దర్శించుకున్నారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న రాఘవేంద్ర రెడ్డి , టీడీపీ నాయకులకు గ్రామ నాయకులు బండ్రాల నరసింహులు, హుసేని, రాము సాగునీటి సంఘం అధ్యక్షుడు వెంకటరాముడు పూలమాలలతో స్వాగతం పలికారు. అనంతరం బంగారమ్మవ్వ, దేవమ్మ ఆలయానికి చేరుకొని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసి , మంగళహారతి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చెన్నై నుండి ప్రత్యేకంగా తెప్పించిన పది రూపాయల నోట్లతో ఐదువేల రూపాయల విలువతో తయారు చేయించిన దండను పోలి వీరేష్, పోలి శివ ఆధ్వర్యంలో టిడిపి ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి వేసి ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్మశాన వాటిక సమస్య లో గ్రామస్తుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం ఆపాలి

## -కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు



మంత్రాలయం , ఫిబ్రవరి 19(శ్రీచక్ర) : శ్మశాన వాటిక సమస్య లో అధికారులు గ్రామస్తుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం ఆపాలని కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు కోరారు. బుధవారం మండల పరిధిలోని చెట్నిహల్లి గ్రామంలోని శ్మశాన వాటిక వద్ద నిర్మించిన శ్మశాన వాటికను అక్కడ ఉన్న ఇళ్లను కెవిపియస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు మండల కార్యదర్శి అంజి, కటికాపర్ల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మారెప్ప సురేష్ గ్రామ నాయకులు రాజు, దానియేలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన కోసం కేటాయించిన సర్వే నెంబర్ 125, 126 లను శుభ్రం చేసి ఉపయోగపడేలా చూడాలే కానీ అలా చేయకుండా, అక్రమంగా 113 లో శవాలను పూడ్చుకుంటూ ఉంటున్నా అధికారులు మాత్రం ఇరు వర్గాలపై కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఇలాంటి సమస్యతో గ్రామంలో ఎలాంటి రచ్చ చేయాలనుకున్నారని మండిపడ్డారు. సర్వే నెంబర్ 113 రస్తాపర ంపోగు లో స్మశానం ఉంది అని తెలిసినా శ్మశాన వాటికను రద్దు చేయకుండా అక్కడే ఇంటి స్థలాలు కేటాయించారన్నారు. వాస్తవంగా సర్వేనెంబర్ 125, 126 ను స్పష్టంగా శ్మశాన స్థలం కేటాయించినట్లు ఉన్నప్పటికీ అక్కడ సౌకర్యాలు కల్పించని కారణంగానే ఎవరు కూడా పూడ్చేందుకు అక్కడికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. గ్రామస్తులు కూడా ఆలోచించాలని, తాతల తండ్రులు నాటునుండి అంటరానితనాన్ని భరిస్తూ అవమానాలు ఎదుర్కొంటూ జీవించే దళితులు, ఇప్పటికీ అవే అశుద్ధ పదార్థాల మధ్య జీవించాలనుకోవడం అంటరానితనాన్ని ప్రేరేపించడవే అవుతుందన్నారు. దళితుల ఇళ్ల మధ్య ఉన్న శ్మశానాన్ని సంపూర్ణంగా తొలగించి, 125, 126 లో ఉన్న స్మశాన స్థలానికి స్పష్టమైన దారిని ఏర్పాటు చేసి,శ్మశానాన్ని శుభ్రం చేయడంతో పాటు చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి, స్మశానంలో బోరును వేసి, షెడ్డు నిర్మించాలన్నారు. రాజకీయ పార్టీ నాయకులు సైతం మెజారిటీ పక్షాన కొమ్ముగాసి పబ్బం గడిపే విధానాన్ని మాని అవసరమైతే దూరంగా ఉన్న శ్మశానానికి వెళ్లేందుకు ప్రత్యేకమైన ఉచితంగా టెంపోను ఏర్పాటు చేయాలన్నారు. లేనిచో దళితుల ఆత్మగౌరవ సమస్య పరిష్కారానికి జిల్లా వ్యాప్త ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, లక్ష్మన్న, యస్ వీరేష్, అబ్రహం, విజయ్, చిన్న తిక్కన్న, నరసన్న, శాంతిరాజు, దేవపుత్ర, లక్ష్మారి నరసన్న, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దకడబూరు మండల రెవెన్యూ కార్యాలయంలో పొజిషన్ సర్టిఫికెట్ కావాలంటే సవాలక్ష షరతులు ఉంటాయంట....!,

ఎమ్మిగనూరు,(పెద్ద కడుబూరు)ఫిబ్రవరి,19(శ్రీ చక్ర):- పెద్దకడబూరు మండల పరిధిలోని చుట్టుప్రక్కల గ్రామీణ ప్రాంత ప్రజలు హౌసింగ్ నిర్మాణాల కొరకు పొజిషన్ సర్టిఫికెట్ కావాలని పెద్దకడబూరు మండల రెవెన్యూ కార్యాలయానికి వెళితే అక్కడ వీఆర్వో,ఆర్ఐ సవాలక్ష ప్రశ్నలు చెప్పి అమాయకులైన రైతులను బలి పశువులుగా వాడుకుంటున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పీఎం ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద మంజూరు చేసుకున్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు హౌసింగ్ అధికారులేమో ముందుగానే పొజిషన్ సర్టిఫికెట్ చేయించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పొజిషన్ సర్టిఫికెట్ కావాలని మండల రెవెన్యూ కార్యాలయంకు వెళితే మాకు సవాలక్ష షరతులు ఉన్నాయని జాలవడి వీఆర్వో కృష్ణమూర్తి, మండల ఆర్ ఐ. జెర్మియా "శ్రీ చక్ర" ప్రతినిధితో తెలిపారు. మేము మీకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే సచివాలయం సర్వేయర్ వచ్చి మీరు చూయించిన ఖాళీ స్థలం దగ్గరకు వచ్చి అక్కడ సర్వే చేసి అక్కడే ఒక తెల్ల పేపర్ మీద మార్కింగ్ వేసి,దిక్కూచులు వేసి ఇస్తారు,అది మా దగ్గరికి తీసుకొని రండి, ఆ తర్వాత మేము మీ గ్రామంలో ఉన్న స్థలం దగ్గరకు వచ్చి స్థలం ఉందో లేదో పరిశీలించిన తర్వాతనే మేము మీకు ఆన్లైన్ లో సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న పొజిషన్ సర్టిఫికెట్ కు మా మొబైల్ లో వచ్చిన పొజిషన్ సర్టిఫికెట్ దరఖాస్తు ఫారంలను అప్రూవల్ చేసి ఫార్మాట్ కొడతామని మండల రెవెన్యూ అధికారులు తెగేసి చెప్పడంతో ఇంత రిస్కు పడలేక బాధితులు లబోదిబోమంటున్నారు. పొజిషన్ సర్టిఫికెట్ కోసం ఇన్ని షరతులు పెట్టిన మండల రెవెన్యూ అధికారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల,గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు



# సైబర్ నేరాల పై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి -మంత్రాలయం సిఐ



మంత్రాలయం , ఫిబ్రవరి 19,(శ్రీచక్ర) సైబర్ నేరాల పట్ల విద్యార్థులుఅప్రమత్తంగా ఉండాలని మంత్రాలయం సిఐ రామానుజులు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన మంత్రాలయంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడుఅలవాట్లు ఈవ్ టిజింగ్ కు దూరంగఉండాలన్నారు.మీవ్యక్తిగతవరాలు అపరిచిత వ్యక్తులకు ఇవ్వరాదన్నారు. ఫోన్ నెంబర్లుకు తెలియని లింక్స్ వస్తే క్లిక్ చేయరాదని , సెల్ కు మీ ఓటిపి వచ్చిందని మాయ మాటలు చెప్పి మీ అకౌంట్లు ఉన్న నగదు ను కాజేస్తారని అటువంటి ఫోన్ కాల్స్ వస్తే పోలీసులు సమాచారం అందించాల న్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య , ఉపాద్యాయులు ,విద్యార్థులు కానిస్టేబుల్ జామీర్ ఉన్నారు.


# వైభవంగా బంగారమ్మవ్వ దేవర ఉత్సవం





మంత్రాలయం , ఫిబ్రవరి 19,(శ్రీచక్ర) : మంత్రాలయం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో వెలసిన బంగారమ్మవ్వ దేవరను గ్రామస్తులు బుధవారం వైభవంగా జరుపుకున్నారు. దేవరను పురస్కరించుకుని బంగారమ్మవ్వ విగ్రహానికి పూజారులు తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతి ఇచ్చారు . గ్రామస్తులు కలశాలు, కుంభాలతో బంగారమ్మవ్వ ఆలయానికి చేరుకొని నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారుఅనంతరం బంగారమ్మవ్వ ఆలయానికి విద్యుత్ దీపాలు , పూలమాలలతో సుందరంగా అలంకరించారు . బంగారమ్మవ్వను దర్శించుకున్న వైకాపా జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి :× రచ్చుమర్రి గ్రామంలో వెలిసిన బంగారమ్మవ్వ దేవరను పురస్కరించుకొని వైకాపా కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి , వైకాపా మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి లు బంగారమ్మవ్వ ను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి , మంగళహారతి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు వైకాపా నాయకులు రోగప్ప బొజ్జప్ప శీను హనుమంతు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు అనంతరం శాలువ పూలమాలలు వేసి సత్కరించారు.

# డ్రంకెన్ డ్రైవ్ , ఒపెన్ డ్రింకింగ్ లో పట్టుబడిన మద్యం 20 మందికి జరిమానా



కర్నూలు, ఫిబ్రవరి 19(శ్రీచక్ర): కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ లో భాగంగా కర్నూలు మూడవ పట్టణ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ , ఒపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించారు. పట్టుబడిన మొత్తం 20 మంది పై కేసులు నమోదు చేశారు. కర్నూలు జెఎఫ్ సి ఎం కోర్టులో హాజరు పరచారు. వీరందరికి జరిమానాలు విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ 5 మంది కి ఒక్కొక్కరి పై రూ. 3 వేల 5 వందల చొప్పున జరిమానా విధిం చారు. ఒపెన్ డ్రింకింగ్ లో పట్టుబడ్డ 15 మంది కి ఒక్కొక్కరి పై రూ. 1000/- జరిమానా విధించారు

# పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ని అఖండ మెజార్టీతో గెలిపించండి.....

డోన్ -ఫిబ్రవరి 19 బుధవారం గుంటూరులోని ఏపీ సీడ్స్ ఆఫీస్ నందు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించిన సీడ్స్ ఆఫీస్ ను సందర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి సిబ్బందితో వారు మాట్లాడుతూ... ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని 27.02.2025 తేదీన జరగబోయే ఎన్నికలలో అర్హత కలిగిన పట్టభద్రులు మొదటి ప్రాధాన్యతఓటువేసిఅఖండ మెజార్టీతో గెలిపించాలని అన్నారు.

# బిడ్డకి జన్మనిస్తూ ఏ తల్లి మరణించకూడదని, వారి ఆరోగ్య అవసరాలపై స్త్రీ శిశు సంక్షేమం, వైద్య శాఖల నిరంతర పర్యవేక్షణ ఉండాలి.- కలెక్టర్ చదలవాడ నాగరాణి







భీమవరం ఫిబ్రవరి 19( శ్రీ చక్ర)బుధవారం భీమవరం కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ భవనం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వైద్య, ఆరోగ్యశాఖ మరియు స్త్రీ శిశు, సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బందితో ఏర్పాటుచేసిన సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి గర్భిణీ స్త్రీలు నమోదు, టీకాలు వేయించడం, పోషకాహార లోపంతో ఎంతమంది పిల్లల ఉన్నారని గుర్తించడం, వారిలో ఏ లోపాలు ఉన్నాయో వైద్య పరంగా పరీక్షలు నిర్వహించడం, వారికి అవసరమైన పోషకాహారం అందించడం, పాఠశాల విద్యార్థులకు ఆర్ బి ఎస్ కే వైద్య పరీక్షలు, ఎన్.సి.డి.సి.డి సర్వే లో దీర్ఘకాలికంగా వ్యాధిలో ఉన్న వారిని గుర్తించడం, ప్రాథమిక హెల్త్ కమ్యూనిటీ సెంటర్లుకు మంజూరైన నిధులను మౌలిక సదుపాయాలు కొరకు వినియోగించడం, దోమలు వలన వచ్చే అంటు వ్యాధులు, బర్డ్ ఫ్లూ వంటి వ్యాధులు పట్ల అప్రమత్తతగా ఉండడం, తదితర అంశాలు, ఆయా శాఖల లక్ష్యాలు, లోటుపాట్లుపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బందితో ఇప్పటికే నాలుగు పర్యాయాలుగా సమీక్షించడం జరిగిందన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. పేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి అప్పులు పాలు కాకుండా చూసే బాధ్యత మీపై ఉందనే విషయాన్ని మీరు నిరంతరం గుర్తుంచుకోవాలన్నారు. మాతృ మరణాలు, శిశు మరణాలు నియంత్రణ లక్ష్యంగా ఎప్పటికప్పుడు తగు వైద్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే తక్కువ బరువు, ఎత్తు గలిగిన చిన్నారులకు పౌష్టికాహారాన్ని, వైద్య సహాయాన్ని అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉంటారనే విశ్వాసం ప్రజలలో కలిగితే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి పేదలు అప్పులు పాలు కావాల్సిన అవసరం ఉండదన్నారు. వైద్య సిబ్బంది ఈ విషయమై ఒకసారి మనసుపెట్టి ఆలోచన చేయాలన్నారు. గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకునేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గర్భిణీ స్త్రీలకు సకాలంలో పౌష్టికాహారం, ఐరన్, పోలిక్ యాసిడ్ తదితర మందులను అందించడం ద్వారా గర్భంలోని శిశువు ఎముకలు దృఢంగా ఏర్పడడంతో పాటు, మెదడు ఎదుగుదల బాగుంటుందని తద్వారా తెలివైన, ఆరోగ్యవంతమైన పిల్లలు జన్మిస్తారనే విషయంపై గర్భిణీలలో పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడిన వారు అవుతారని తెలిపారు. బిడ్డకు జన్మనిస్తూ జిల్లాలో ఏ తల్లి మరణించకూడదని నొక్కి చెప్పారు. మొదటి కాన్పులో ఆపరేషన్ లేని సుఖ ప్రసవాన్ని మీరు అందించగలిగితే, తదుపరి వారు వేరే చోటకి వెళ్లాల్సిన అవసరం ఎట్టి పరిస్థితుల్లో కలగదు అన్నారు. తద్వారా ప్రతి గర్భిణీ మహిళ ప్రభుత్వ వైద్యానికే మొగ్గు చూపుతారన్నారు. రోగులను చిరునవ్వుతో ఆహ్వానించి వైద్యం అందిస్తే అదే వారికి ఒక మెడిసిన్ వలే పని చేస్తుందనే విషయం కూడా గుర్తుంచుకోవాలన్నారు. వైద్యులు డ్యూటీ సమయాన్ని కచ్చితంగా పాటించాలన్నారు. అప్పుడే ఓపి పెరగడంతో పాటు, సంబంధిత వైద్యులకు, సిబ్బందికి మంచి గుర్తింపు, గౌరవం లభిస్తాయని స్పష్టం చేశారు. ఒక తల్లి మరణిస్తే ఆ కుటుంబం అంతా చాలా ఇబ్బందులను ఎదుర్కొంటారని, మరి ముఖ్యంగా పిల్లలకు ఎక్కువ ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. మాతృ మరణాలు నిరోధించడంలో భాగంగా ప్రతినెల ఆయా గ్రామాలలో వైద్య సిబ్బంది పతి గృహాన్ని సందర్శించి పాజిటివ్ అయిన వెంటనే రిజిస్ట్రేషన్ చెసి అవసరమైన మందులను అందజేయాలని సూచించారు. అలాగే బాలింతలకు ఆరు నెలల కాలం వరకు వైద్య సహాయాన్ని, సూచనలను అందించాలని తెలిపారు. వైద్య వృత్తిలో మీరు చేసిన సేవలు నిరుపయోగం కావని, భవిష్యత్తులో మీ కుటుంబానికి మద్దతుగా నిలుస్తాయన్నారు. వేరు, వేరు ప్రాంతాల నుండి జిల్లాకు వివిధ పనుల నిమిత్తం వచ్చే కుటుంబాల్లోని మహిళలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అటువంటి మహిళలకు, పిల్లలకు ప్రత్యేక శ్రద్ధతో వైద్య సహాయం అందించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య శాఖ అధికారి డా. బి.భాను నాయక్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, డి ఐ ఓ డా. డి.దేవసుధాలక్ష్మి, డి పి ఎమ్ ఓ డా.సి హెచ్ ధనలక్ష్మి, ఏవో డా.సిహెచ్ భావన, ఎస్.ఓ ఎం.ఎస్ ప్రసాద్, డిప్యూటీ డెమో పి.అనంతలక్ష్మి, పీహెచ్సీ, యూ పి హెచ్ సి ల మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సిడిపిఓలు, సూపర్వైజర్లు, ఆశా వర్కర్లు, అంగన్వాడి వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు

## పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నియంత్రించండి.మున్సిపల్ కమిషనర్ నాయుడు.





రామచంద్రపురం , ఫిబ్రవరి 19(శ్రీచక్ర)రామచంద్రపురం పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నియంత్రించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ నాయుడు పట్టణంలో గల రెస్టారెంట్ ,టీ స్టాల్ యజమానులకు సూచించారు. ఈ మేరకు బుధవారంరామచంద్రపురం పరపాలక సంఘం మున్సిపల్ కార్యాలయంలో గల కమిషనర్ ఛాంబర్ నందు పట్టణ పరిధిలోగల హోటల్స్ , రెస్టారెంట్లు టీ స్టాల్స్, యజమానులకు కమిషనర్ ఛాంబర్ నందు సమావేశం ఏర్పాటుచేశారు . ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ నాయుడు మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణ మన అందరి బాధ్యతగా తీసుకుని వాడకాన్ని నియంత్రించాలని అన్నారు.ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా హోటల్ రెస్టారెంట్ షాపుల యజమానులు 120 మైక్రాన్స్ కన్నా తక్కువ మైక్రాని గల క్యారీ బ్యాగ్స్ ను వాడకూడదని అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకూడదని తెలిపారు . టీ స్టాల్ యాజమానులు పేపర్ గ్లాసుల వాడకూడదని గాజు గ్లాసులు పింగాణికప్స్ వాడలని కమిషనర్ సూచించారు రామచంద్రపురం నందు ప్లాస్టిక్కు పూర్తిగా నియంత్రించాలని ఇందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఆయన ఈసందర్భంగా కోరారు.

## మంత్రి సుభాష్ వీరాభిమాని విజయవంతంగా ముగిసిన పాదయాత్ర

### .మంత్రి సుభాష్ తో శ్రీవారిని దర్శించుకున్న అభిమాని మణికంఠ

రామచంద్రాపురం, ఫిబ్రవరి 19( శ్రీచక్ర) గత 17 రోజుల క్రితం మంత్రి సుభాష్ వీరాభిమాని మణికంఠ తిరుమలకు తలపెట్టిన పాదయాత్ర విజయవంతంగా ముగిసింది . దీంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తో తిరుమలలో ఏడుకొండల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.కే. గంగవరం మండలం సుందరపల్లి గ్రామం నుంచి తిరుమల తిరుపతి మధ్య సుమారు 700 కిలోమీటర్ల దూరం కాలి నడకన 17 రోజులు యాత్ర ఎట్టకేలకు ఆ వీరాభిమాని తిరుమల శ్రీవారు, ఆపదమొక్కులవారి సన్నిధిలో తన అభిమాన నాయకుడు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో తిరుమలేశుని సన్నిధిలో మొక్కు చెల్లించుకుని తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఏంటా విషయం అనుకుంటున్నారా పూర్తి వివరాల్లోకి వెళితే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం నియోజవర్గం కె.గంగవరం మండలం సుందరపల్లి గ్రామంకు చెందిన రంకిరెడ్డి మణికంఠ గత సార్వత్రిక ఎన్నికల్లో రామచంద్రపురం నియోజవర్గం నుంచి తన అభిమాన రాజకీయ నాయకుడు వాసంశెట్టి సుభాష్ అత్యధిక మెజార్టీతో గెలవాలని తిరుమలేశుని మొక్కుకున్నాడు. న్యాయమైన కోరిక కోరుకున్న తన భక్తుని మొర ఆలకించిన తిరుమల వెంకటేశ్వర స్వామి తన భక్తుని కోరిక మన్నించి, కరుణించి తథాస్తు అన్నారు. ఇంకేముంది రామచంద్రపురం నియోజకవర్గ ప్రజల ద్వారా సుమారు 28 వేల ఓట్ల మెజారిటీతో వాసంశెట్టి సుభాష్ గెలుపొంది రికార్డు సృష్టించారు. తన మొక్కు కోర్కెను తీర్చిన స్వామివారి ముక్కు చెల్లించేందుకు ఫిబ్రవరి 3న మంత్రి సుభాష్ సమక్షంలో ఆంజనేయస్వామికి పూజలు చేసి సుందరపల్లి నుంచి తిరుమలకు నడక యాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర 17 రోజులపాటు సాగి బుధవారం తిరుమల చేరుకుంది. అనుకోని రీతిగా మంత్రి సుభాష్ తిరుపతి వెళ్లడం, తన వీరాభిమాని రంకిరెడ్డి మణికంఠ, వారి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి ఆశీస్సులు పొందుకున్నారు. తన నడక యాత్ర ప్రారంభించిన మంత్రి సుభాష్ సమక్షంలోనే మొక్కు చెల్లించుకోవడంతో మణికంఠ ఆనందానికి అవధులు లేకుండా పోయింది. మణికంఠ పాదయాత్ర పై రాష్ట్రంలో విస్తృతమైన చర్చకు దారి తీసింది. ఇలాంటి వీరాభి మానులు కూడా ఉంటారా? అంటూ అటు రామచంద్రపురం నియోజవర్గంలోనూ,ఇటు రాష్ట్రంలోనూ చర్చ జరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మొక్కు చెల్లించుకున్న రంకిరెడ్డి మణికంఠ తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ రాజకీయాల్లోకి రాకముందు నుంచే మంత్రి సుభాష్ మానవత్వంతో ఎంతోమంది నిరుపేదలకు, నిరుద్యోగులకు, వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఆర్థికంగా ఆదుకున్నారని, అలాంటి మంచి మనసున్న మనిషి అధికారంలో ఉంటే లక్షలాది మందికి సహాయపడతారని దేవునికి మొక్కుకున్నట్టు తెలిపారు. నా కోరిక ప్రకారం మంత్రి సుభాష్ ఊహించిన దానికంటే కష్టంలో ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీలతో సంబంధం లేకుండా ఆపన్నులకు సహాయం చేస్తూ ముందుకు వెళుతున్నారని ఆనంద వ్యక్తం చేశారు. మంత్రి సుభాష్ అభిమానిగా ఉండడం తన అదృష్టమని మణికంఠ పేర్కొన్నారు. తనపై ఇంతటి అభిమానం చూపించిన మణికంఠను మంత్రి సుభాష్ ఈసంధర్బంగా ప్రత్యేకంగా అభినందించారు.



# క్యాంపస్ ఇంటర్వ్యూలో కె.జి.ఆర్.ఎల్ ఫార్మశీ కళాశాల నుంచి 42 మంది విద్యార్థులు ఎంపిక







భీమవరనీ ఫిబ్రవరి 19( శ్రీ చక్ర): స్థానిక ది భీమవరం ఎడ్యుకేషనల్ సొసైటీ " ఆధ్వర్యంలో నడుపబడుచున్న " కె.జి.ఆర్.ఎల్ ఫార్మశీ " కళాశాలలో బుధవారం దివిస్ ఫార్మా లబ్రే?టోరీస్ లిమిటెడ్ వారు నిర్వహించిన క్యాంపస్ ప్లేసెమెంట్ డ్రైవ్ లో కె.జి.ఆర్.ఎల్ ఫార్మశీ కళాశాల నుంచి 42 మంది విద్యార్థులు బల్కడ్రగ్ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు గాను ఎంపికయ్యారు. బయట కళాశాల ల నుండి 4 విద్యార్థులను ఎంపిక చెయ్యటం జరిగింది. వీరికి సంవత్సరానికి 2.5. నుంచి 3.0 లక్షలు వరకు వారి సాలరీని ప్రకటించారు.ఈ ఇంటర్వ్యూ లో 4 విభాగలుగా విభజించి వారి నైపుణన్ని మేధషను పరీక్షించి ఎంపికచెయ్యటం జరిగింది. ఈ కాంపస్ డ్రైవ్ లో అర్హతకలిగిన విద్యార్థిలు బి. ఫార్మసీ, ఎమ్. ఫార్మసీ, బి. ఎస్. సి. కెమిస్ట్రీ మరియు బి. టెక్. కెమికల్ ఇంజనీరింగ్ డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి ఎంపికచేయ్యటం జరిగింది. వీరిని విశాఖపట్నం, కాకినాడ మరియు హైద్రాబాద్ సమీపంలో ఉన్న దివిస్ ఫార్మా లబ్రే?టోరీస్ లిమిటెడ్ లోబల్కడ్రగ్ ప్రొడక్షన్ విభాగంకు బదిలీ చేస్తారు అని డైరెక్టర్. డా . కె. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్. డా. డి. రాఘవ మరియు వైస్ ప్రిన్సిపాల్ డా. కె. నిర్మల తెలిపారు. సుమారుగా ఫార్మసీ విద్యార్థులు పదిహేను మంది ఈ అవకాశాన్ని ఛేజిక్కించుకున్నారు. వారికి అభినందనలు తెలియజేస్తూ ప్రెసిడెంట్ కొటికలపూడి గోవిందరావు, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ మెంటే రామ్మనోహర్ కోశాధికారి గన్నాబత్తుల వెంకట శ్రీనివాస్ మరియు ఇతర గవర్నింగ్ బాడీ మెంబెర్స్ ఆధ్వర్యంలో కె. జి. ఆర్. ఎల్. కళాశాల విద్యార్థులు బి . ఫార్మసీ , ఎం . ఫార్మసీ , బీఎస్సీ కోర్స్ విద్యార్థులు మరియు ఎమ్మెస్సీ ఇతర కళాశాల విద్యార్థులు ఈ క్యాంపస్ ఇంటర్వ్యూ కి హాజరై వారి ప్రతిభను చాటుకున్నారు అని కె.జి.ఆర్.ఎల్ ఫార్మశీ డైరెక్టర్. డా . కె. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్. డా. డి. రాఘవ వైస్ ప్రిన్సిపాల్ . కె . నిర్మల తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు

## వి ఎస్ ఎం లో సైన్స్ ఫ్యూజన్ 2కె 25.రెండు రోజుల పాటు జరగనున్న కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ




పరిసర ప్రాంతాల పాఠశాల విద్యార్థులు వీక్షించేందుకు అవకాశం

రామచంద్రపురం , ఫిబ్రవరి 19( శ్రీచక్ర):వి ఎస్ ఎం డిగ్రీ అటానమస్ కళాశాలలో ఈనెల 28 నుండి మార్చి 1వ తారీకు వరకు రెండు రోజులు పాటు సైన్స్ ఫ్యూజన్ 2కే 25 నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎం ఎస్ ఎన్ మూర్తి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ నీ ఆయన బుధవారం విడుదల చేసారు. కళాశాలలోని సైన్స్ విభాగాలకు చెందిన విద్యార్థులందరూ వివిధ అంశాలపై ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శిస్తారని ఈ సందర్భంగా తెలిపారు .28వ తేదీన వి ఎస్ ఎం కళాశాల పరిసర ప్రాంతాల్లోని గ్రామ స్థాయి లోని పాఠశాలల విద్యార్థులందరికీ వీక్షించేందుకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ ఎన్ అలీఅన్సారీ వివరించారు.అలాప్రదర్శనకు వచ్చే విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలోకళాశాలవైస్ప్రెసిడెంట్ఎం ఎస్ ఎన్ మూర్తి,ప్రిన్సిపాల్ అందరి తో బాటు కంప్యూటర్ సైన్స్ హెచ్ ఓ డి లు ఫణి కుమార్, చంద్రావతి, కామర్స్ హెచ్ ఓ డి కె వి వి ఎస్ చౌదరి, మేనేజ్మెంట్ హెచ్ ఓ డి కె వి వి ఎస్ ఎస్ ప్రకాష్ ,తదితరులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచింగ్ దొంగలను అరెస్ట్ చేసిన గొల్లపాలెం పోలీసులు...!

### ఇద్దరు ముద్దాయిల అరెస్టు
### .రెండు కాసుల బంగారం చేయను స్వాధీనం.







కాజులూరు, ఫిబ్రవరి 19( శ్రీచక్ర):ఇటీవల గొల్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న చైన్ స్నాచింగ్ దొంగలను ఎట్టకేలకు గొల్లపాలెం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు కాజులూరు మండలం కోలంక గ్రామంలో ఈ నెల 8 వ తేదీన బుచ్చి వెంకట సుభద్రయమ్మ (72) సంవత్సరాలు వయస్సు గల వృద్ధురాలి మెడలో బంగారు గొలుసుని గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించుకొని పోయినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపాలెం ఎస్ ఐ ఎం మోహన్ కుమార్ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో కాకినాడ సబ్ డివిజనల్ పోలీసు అధికారి పి .దేవరాజ్ మానిష్ పర్యవేక్షణలో కాకినాడ రూరల్ సి ఐ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసులో ఇద్దరు ముద్దాయిలు లను అరెస్టు చేశారు.కె. వీరబాబు, కూనపరెడ్డి నారాయణరావు లను కోలంక గ్రామ శివారు హైస్కూల్ వద్ద అరెస్ట్ చేసి వీరి వద్ద నుండి దొంగిలించబడిన 2 కాసుల బంగారు గొలుసును రికవరీ చేసి ముద్దాయిలను జుడీష్యల్ రిమాండ్ కు తరలించారు. ఈ సందర్భంగా గొల్లపాలెం ఎస్ ఐ మోహన్ కుమార్ మాట్లాడుతూ అరెస్టు కాకుండా ముద్దాయిల్లో కోలంక గ్రామానికి చెందిన కోనబ్రేటర్ నారాయణరావు, రంగంపేట మండలం కోటపాడు గ్రామానికి చెందిన కొడగల వీరబాబులు గుర్తించామన్నారు.నేరాలను అరికట్టుటకు ప్రతి గ్రామము లో సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.ఆ కెమెరాలు ఉన్న గ్రామాలలో నేరాల సంఖ్య తగ్గిందని ఈ స్సందర్భంగా పేర్కొన్నారు.అలాగే జిల్లాలో దొంగతనాలను, చైన్ స్నాచింగ్ లను అరికట్టే క్రమంలో నిరంతర వాహన తనికీ లు నిర్వహిస్తూ నెంబర్ లేని వాహనాలను, రికార్డులు లేని వాహనాల పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నట్టు తెలిపారు.ఈ మద్య యువత మద్యానికి, చెడు వ్యాసనాలకు బానిసలై దొంగతనాలకు అలవాటు పడ్డారని కనుక ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.వ్యాపార సంస్థలు, విద్య సంస్థలు ముఖ్యమైన సంస్థలు మీ యొక్క ఆస్తి దొంగతనమునకు గురి కాకుండా ఉండేందుకు, ఎప్పుడు మీ పర్యవేక్షణలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జనసమూహాలు, నివాస గృహములకు దూరముగా ఉన్న గృహములు , వ్యాపార ఇతర ముఖ్య సంస్థలు కు చెందిన యాజమానులు తప్పనిసరిగా సిసికెమెరాలు ఏర్పాటుచేసుకోవాలనితెలోపారు.మహిళలు నగలు వేసుకొని శుభకార్యాలకు వెళ్లేటప్పుడు, ఒంటరిగా వెళ్లేటప్పుడు అప్రమత్తంగ ఉండాలని ఎస్ఐ మోహన్ కుమార్ సూచించారు.

# నేడు గుండె వ్యాధుల నిపుణుల డాక్టర్ జయరామ్ కోటకు రాక

కోట ఫిబ్రవరి 19 (శ్రీచక్ర) : నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ నుండి ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ జయరాంమ్ నేడు (గురువారం) కోట మండలంలోని జనతా క్లినిక్ హాస్పిటల్ కు ఉదయం 10 గంటలకు వస్తున్నట్లు జనతా క్లినిక్ హాస్పిటల్ డాక్టర్ మల్లి.జగదీష్,డాక్టర్ ఉమేరా లు తెలిపారు.ఈ సందర్బంగా డాక్టర్ ఎమ్. జగదీష్ మాట్లాడుతూ కోట మండలంలోని ఎన్ సి ఆర్ నగర్ లో ఉన్న జనతా క్లినిక్ హాస్పిటల్ లో గుండె వ్యాధి చికిత్స లు నిర్వహించడం జరుగుతుందన్నారు.అదేవిధంగా ఇలాంటి మంచి అవకాశాన్ని కోట వాకాడు చిట్టమూరు, చిల్లకూరు మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మత్స్యశాఖ సంపదను పెంపొందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### తిరుపతి పార్లమెంట్ మైనార్టీ నాయకులు షేక్.జలీల్ అహ్మాద్,







తిరుపతి జిల్లా రైతు విభాగ కార్యదర్శి నెల్లూరు.మోహన్ రెడ్డి కోట ఫిబ్రవరి 19 (శ్రీచక్ర) : మత్స్యకారులను అభివృద్ధి మార్గంలో నడిపించడానికి కూటమి ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమని తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్,నెల్లూరు మోహన్ రెడ్డి లు అన్నారు.ఈ సందర్భంగా బుధవారం కోట మండలంలోని నెల్లూరు పల్లి కొత్తపాలెం పెన్నక్క చెరువులో 12 లక్షల చేప పిల్లలను వదిలారు.అనంతరం షేక్.జలీల్ అహ్మద్,నెల్లూరు. మోహన్ రెడ్డి లు మాట్లాడుతూ కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం లో గూడూరు నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు పి ఎమ్ ఎమ్ ఎస్ వై పథకం ద్వారా 2024-25 సంవత్సరానికి గాను నెల్లూరు పల్లి కొత్తపాళెం చెరువుకు నూతనంగా ఎన్నికైన తిరుపతి జిల్లా రైతు కార్యదర్శి నెల్లూరు.మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 12 లక్షల చేప పిల్లలును విడుదల చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కోట మండలం తహసీల్దార్ కే.జేజే రావు,ఎంపీడీవో వేణు,తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్.జలీల్ అహ్మద్,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పలగాటి భాస్కర్ రెడ్డి,మారం రెడ్డి శ్రీధర్ రెడ్డి,దశరథ. రామిరెడ్డి,ఎంపీటీసీ సభ్యులు దారా.సురేష్,షంషుద్దీన్, పలగాటి జితేంద్ర రెడ్డి,కోకర్లమధుయాదవ్,నౌషద్,బాబు,సిద్ధపరెడ్డిపోలమ్మ,సుహాసిని, నీలు ,తెలుగుదేశం పార్టీ కోసం సోషల్ మీడియా మీజురు మధుబాబు, రూపేష్ ,నీలేష్,నెల్లూరు పల్లి కొత్తపాలెం చెరువు కమిటీ నాయకులు మత్స్యకార జిల్లా అధికారులు నాగరాజు, స్థానిక మండల మత్స్యశాఖ అధికారి రెడ్యా నాయక్,గ్రామ ప్రజలు శానంపూడి గోపాల్ రెడ్డి,,తదితరులు పాల్గొన్నారు.


## డ్రైనేజీ కాలువలను పరిశీలిస్తున్న టిడిపి నాయకురాలు



తిరుపతి.సుహాసిని కోట ఫిబ్రవరి 19 (శ్రీచక్ర) : కోట మండలంలోని శ్యామసుందర పురంలో డ్రైనేజీ కాలువలో చెత్తాచెదారం నిల్వ ఉండడంతో టిడిపి నాయకురాలు తిరుపతి సుహాసిని ఆధ్వర్యంలో తొలగించారు.ఈ సందర్భంగా శ్యామసుందరపురంలో నివాసం ఉంటున్న ప్రజల కోసంగా ఇటీవలన ప్రగతి కాలేజ్ రోడ్డు నుండి శ్యామసుందరిపురం గ్రామంలోకి రావడానికి గ్రావెల్ రోడ్డును కూడా గూడూరు ఎమ్మెల్యే పాశం.సునీల్ కుమార్,తిరుపతి పార్లమెంట్ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్.జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది.

# భూముల రిసర్వే పకడ్బందీగా నిర్వహించాలి. ... జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




భీమవరం: ఫిబ్రవరి 19,( శ్రీ చక్ర)జిల్లాలో భూముల రిసర్వే వేగవంతంగా, పకడ్బందీగా నిర్వహించి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.బుధవారం విజయవాడ నుండి భూముల రిసర్వే పై సీసీఎల్ఏ జి. జయలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ జి.జయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాల్లో భూముల రిసర్వే పై ప్రత్యేక శ్రద్ధ వహించి పకడ్బందీగా నిర్వహించాలని, నివేదికలు పంపాలని, నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ విషయంపై క్షేత్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. భూముల రిసర్వే ప్రక్రియ రెవెన్యూ శాఖ లో అతి ముఖ్యమైన అంశమని అన్నారు. ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం వహించారాదని అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ప్రజలకు అందాల్సిన పౌర సేవలు సంతృప్తి స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయాలన్నారు. రెవెన్యూ శాఖ లో ఎక్కడా కూడా పెండింగ్ అంశాలు లేకుండా చూడాలన్నారు. జిల్లాలో భూముల రిసర్వే వేగవంతంగా, పకడ్బందీగా నిర్వహించి నివేదికలు సమర్పించాలని అన్నారు. భూముల రిసర్వే లో రెవెన్యూ, సర్వే ల్యాండ్ శాఖల అధికారులు నేరుగా రైతుల వద్దకే వెళ్లి వివరాలు సేకరించి, రికార్డులను పరిశీలించి నివేదికలు తయారు చేయాలని అన్నారు. అధికారులు ఖచ్చితంగా క్షేత్ర స్థాయికి వెళ్లి భూముల రిసర్వే పై పరిశీల చేయాలన్నారు. భూ రికార్డులను సంతృప్తికరంగా ఏలాంటి లోటుపాట్లను లేకుండా అప్డేట్ చేయాలని అన్నారు. ఇందుకు ఆయా తహసీల్దార్, వి ఆర్ ఓ లు భాద్యత వహించాలని అన్నారు. విలేజ్ బౌండరీ, గ్రౌండు బౌండరీ తప్పనిసరిగా చేయాలని అన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చిత సమాధానము ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే అధికారి జాషువా, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# యనమలకు ఆల్ హ్యాపీస్ కు అడ్డంకులు



కాకినాడ, ఫిబ్రవరి 19, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడికి తుని నియోజకవర్గంలో పట్టు చిక్కడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ల ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించింది. తిరుపతి కార్పొరేషన్ లో డిప్యూటీ మేయర్, పిడుగురాళ్ల వైస్ ఛైర్మన్ పదవిని కూడా టీడీపీ కైవసం చేసుకుంది. కానీ తుని విషయానికి వచ్చేసరికి రామకృష్ణుడు ఎత్తులు పారడం లేదు. సుదీర్ఘకాలం తునిని టీడీపీ గెలుచుకుందనుకున్నా ఆనందం, తన కుమార్తె తుని ఎమ్మెల్యే అయిందన్న సంతోషం కన్నా ఈ వైస్ ఛైర్మన్ పదవిని సొంతం చేసుకోలేకపోతున్నాననే బాధ యనమలలో ఎక్కువగా కనిపిస్తుంది. తాజాగా ఈరోజు కూడా తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు. సమయం మించిపోవడంతో నాలుగోసారి కూడా తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. ఉదయం నుంచి తునిలో హైడ్రామా నడిచింది. టీడీపీకి చెందిన కౌన్సిలర్లు అందరూ కౌన్సిల్ హాలుకు చేరుకున్నా వైసీపీ కౌన్సిలర్లు మాత్రం హాజరు కాలేదు. వైసీపీ కౌన్సిలర్లందరూ... మాజీ మంత్రి దాడి శెట్టి రాజా తన పార్టీకి చెందిన కౌన్సిలర్లతో ఉన్నారు. ఆయన నుంచి బయటకు రప్పించేందుకు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలించలేదు. ఇప్పటి వరకూ మూడుసార్లు వాయిదా పడటంతో నాలుగో సారి అయినా వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుందని భావించారు. కానీ నేడు కూడా వాయిదా పడటంతో తిరిగి ఈ ఎన్నిక ఎప్పుడు నిర్వహిస్తారన్నది తెలియాల్సి ఉంది. తునిలో పట్టు పెంచుకుని పార్టీలో తన సత్తా చాటుదామనుకుంటున్న యనమల రామకృష్ణుడికి మాజీ మంత్రి దాడిశెట్టి రాజా చుక్కలు చూపిస్తున్నారు. తన వర్గంలో ఉన్న కౌన్సిలర్లు ఎటూ వెళ్లకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. కోడిపిల్లలకు తల్లి కాపలా కాచుకుంటున్నట్లు కాపాడుకుంటున్నారు. దీంతో యనమలకు తుని మున్సిపాలిటీలో ఊపిరి సలపడం లేదు. అప్పటికీ పది మంది కౌన్సిలర్లు వైసీపీ నుంచి వెళ్లిపోయారు. అయితే మిగిలిన వారు వెళ్లకుండా తన పట్టును కాపాడుకుంటున్నారు. దీంతో అధికారాన్ని ఉపయోగించుకుని ఎన్నో ప్రయోగాలు చేస్తున్నా ఫలవంతం కావడం లేదు. తుని మున్సిపల్ ఛైర్మన్ పదవిని చేజిక్కించుకున్న తర్వాత పార్టీ హైకమాండ్ తన వైపు చూస్తుందని యనమల రామకృష్ణుడు భావించారు. ఇప్పటికే యనమల రామకృష్ణుడుకు పార్టీ అధినాయకత్వానికి మధ్య గ్యాప్ బాగా పెరిగింది. యనమల కుటుంబంలో అనేక మందికి టిక్కెట్లు ఇచ్చినప్పటికీ తనకు ఇంకా మంత్రి పదవి కావాలని పట్టుబట్టడం ఏంటన్నది పార్టీ అధినాయతక్వం ప్రశ్నిస్తున్నది. అదే సమయంలో తాను సీనియర్ గా పార్టీకి ఎంతో సేవలు చేశానని, కష్ట సమయంలో వెన్నుదన్నుగా ఉన్నానని, అలాంటి తనకు మంత్రి పదవి ఇవ్వకపోవడమేంటన్నది యనమల రామకృష్ణుడి సూటి ప్రశ్న గా ఉంది. యనమల బీసీలకు అనుకూలంగా, కాకినాడ పోర్టుపై చేసిన కామెంట్స్ కూడా అధినాయకత్వానికి ఇబ్బందికరంగా మారాయి. దీంతో ఆయనను దూరం పెట్టినట్లే కనిపిస్తుంది. ని పట్టణంలో గతంలో టీడీపీ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని మూడుసార్లు సొంతం చేసుకుంది. వైసీపీ, కాంగ్రెస్ ఒక్కోసారి తుని మున్సిపాలిటీ సొంతం చేసుకున్నాయి. అయితే ఈసారి వైస్ చైర్మన్ ఎన్నిక ద్వారా తన బలాన్ని చూపించుకునేందుకు ఇటు యనమల, అటు దాడిశెట్టి రాజా ఎవరి ఎత్తుల్లో వారున్నారు. వైస్ చైర్మన్ గెలిస్తే..మార్చిలో ఛైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి ఆ సీటును కూడా తమ ఖాతాలో వేసుకోవాలని పార్టీలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎవరికి వారు తగ్గకపోవడంతో వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడుతూ వస్తోంది.వైస్ ఛైర్మన్ ఎన్నిక రోజు టీడీపీలో చేరిన కౌన్సిలర్లు వస్తున్నారు కానీ..వైసీపీ కౌన్సిలర్లు రావడం లేదు. పైగా ఛలో తుని అని పిలుపునిచ్చి వైసీపీ పొలిటికల్ హీట్ క్రియేట్ చేస్తోంది. అయితే అధికారంలో ఉండి కూడా వైసీపీపై అప్పర్ హ్యాండ్ సాధించడంలో యనమల వెనుకబడిపోతున్నారట. దాడిశెట్టి రాజా వ్యూహానికి తగ్గట్లుగా టీడీపీ నేతల కౌంటర్ యాక్షన్ ప్లాన్ ఉండటం లేదన్న మాట సైకిల్ పార్టీ కార్యకర్తల నుంచి వినిపిస్తోంది.నాలుగోసారి కూడా తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడటం చర్చనీయాంశం అవుతోంది. హైడ్రామా మధ్య పెండింగ్‌లో పడుతూ వస్తోంది. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా తన కౌన్సిలర్ల చేజారిపోకుండా కాపాడుకోవడంలో సక్సెస్ అవుతున్నారు. ఆయన క్యాంప్ నుంచి కౌన్సిలర్లను బయటకు రప్పించేందుకు యనమల చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదట.ఇప్పటివరకు మూడుసార్లు వాయిదా పడటంతో నాలుగోసారైనా వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుందని భావించారు. కానీ నాలుగోసారి కూడా వాయిదా పడింది. మరి ఐదోసారి అయినా వైస్ ఛైర్మన్ పీఠంపై ఏదో ఒకటి తేలుతుందా..లేక వాయిదాల ఎపిసోడ్ కంటిన్యూ అవుతుందా అనేది వేచి చూడాలి.పొలిట్ బ్యూరో లో కూడా కొత్త వారికి అవకాశం అంటే యువతరానికి అవకాశం కల్పించాలన్న ఉద్దేశ్యంతో హైకమాండ్ ఉంది. ఈ నేపథ్యంలోనే యనమల రామకృష్ణుడు తుని మున్సిపాలిటీపై జెండా ఎగురేసి కాలరు పైకెగరేద్దామనుకున్నారు. కానీ అది వీలు కావడం లేదు.

# మలుపులు తిరుగుతున్న వంశీ కేసు



విజయవాడ, ఫిబ్రవరి 19, మంగళవారం సాయత్రం ఏడు గంటలకు బ్లాస్టింగ్ విషయాన్ని వెల్లడిస్తామని ప్రకటించింది. ఆ ప్రకారం ఏడుగంటలకు ఓ పోస్టు పెట్టింది. వంశీ అరెస్టు లక్ష్యంగా చంద్రబాబు సర్కార్ కుట్రలు చేసిందని సత్యవర్ధన్ కోర్టులో ఇచ్చిన స్టేట్‌మెంట్ ను బయట పెట్టారు. గన్నవరం కేసులో కట్టుకథలు, కల్పితాలు, తప్పుడు సాక్ష్యాలు, అక్రమ

### బ్లాస్టింగ్ ఇస్తామన్న వైసీపీ
### వంశీ ఇంటికి వెళ్లిన సీసీటీవీ ఫుటేజ్ రిలీజ్

అరెస్టులు అని మండిపడింది. దానికి కోర్టు ముందు సత్యవర్ధన్ స్టేట్‌మెంటే అందుకు నిదర్శనమని తెలిపింది. చంద్రబాబు సర్కార్ కుట్రను సత్యవర్ధన్ ఫిబ్రవరి 10, 2025 నాటు సత్యవర్ధన్ ఇచ్చిన స్టేట్‌మెంటే సాక్ష్యమని తెలిపింది. ఘటన జరిగిన సమయంలో తాను అక్కడలేనన్న సత్యవర్ధన్ స్టేట్ మెంట్లో చెప్పారు. టీడీపీ నాయకుడు బచ్చుల సుబ్రహ్మణ్యం ఈ కేసులో సాక్షిగా తన వద్ద సంతకం తీసుకున్నాడని సత్యవర్ధన్ తెలిపారు. ఇలా తాను కోర్టు ముందుకు వచ్చి స్టేట్ మెంట్ ఇవ్వడానికి తనను ఎవరూ బలవంతం పెట్టలేదని కూడా కోర్టులో సత్యవర్ధన్ వెల్లడించారని వైసీపీ తెలిపింది. తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో వల్లభనేని వంశీ మోహన్ ను అరెస్టు చేయలేదు. ఆయన ఫిర్యాదుదారు అయిన సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసి బెదిరించి ..కేసును వెనక్కి తీసుకునేలా చేశారన్న కారణంతో అరెస్టు చేశారు. అయితే హఠాత్తుగా ఆయన పేరును గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో చేర్చి అరెస్టు చేశారని వైసీపీ అంటోంది. ఫిర్యాదుదారు సత్యవర్ధన్ తో బెదిరించి ఆ స్టేట్ మెంట్ ఇప్పించారని టీడీపీ ఆరోపిస్తోంది. ఇప్పటికే సత్యవర్ధన్ ను వంశీ తీసుకెళు న్న దృశ్యాలను ఆ పార్టీ విడుదల చేసింది. సత్యవర్ధన్ కోర్టులో అలాంటి స్టేట్ మెంట్ ఇచ్చారని తెలిసిన తర్వాతనే ఈ వివాదం అంతా జరుగుతోంది.కొత్తగా ఇలా స్టేట్ మెంట్ ఇచ్చారని వైసీపీ బ్లాస్టింగ్ అని ప్రకటించడం ఆసక్తికరంగా మారింది.

కిడ్నాప్ సీసీటీవీ రిలీజ్‌గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అక్రమంగా అరెస్టు చేశారని వైసీపీ నేతలతో పాటు జగన్ చేస్తున్న ఆరోపణల్ని టీడీపీ నేతుల ఖండించారు. ఫిర్యాదు దారు అయిన సత్యవర్ధన్ తో కేసును వెనక్కి తీసుకునేందుకు వంశీ కుట్రకు పాల్పడ్డారన్నారు. సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసి..డబ్బులు ఆశ చూపి కేసును విత్ డ్రా చేసుకునేలా చేశారన్నారు. దానికి సంబంధించి వంశీ అనుచరులు .. సత్యవర్ధన్ ను.. వంశీ ఇంటికి తీసుకెళు న్న సీసీ టీవీ దృశ్యాలను విడుదల చేశారు. విజయవాడ కోర్టులో సత్యవర్ధన్ కేసును ఉపసంహరించుకునేలా చేసేందుకు సత్యవర్ధన్ ను ముందుగా ఆయన అనుచరులు పట్టుకున్నారు. ఆ తర్వాత ఆయనను తీసుకుని హైదరాబాద్ లోని మైహోమ్ భూజాలోని ఇంట్లోకి వెళ్లారు. అక్కడ సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను టీడీపీ నేతలు ప్రదర్శించారు. లిఫ్టులో సత్యవర్ధన్ ను వంశీ అనుచరులు తీసుకెళ్తున్న దృశ్యాలు ఉన్నాయి. కిడ్నాప్ చేసి తీసుకెళ్లి బెదిరిచి.. డబ్బులు ఆశ చూపి.. ఫిర్యాదును వెనక్కి తీసుకునేలా చేశారని టీడీపీ స్పష్టం చేశారు. పూర్తి ఆధారాలతోనే కేసులు నమోదు చేశారన్నారు. ఓ ఫిర్యాదుదారును .. ఓ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని ప్రభావితం చేయడం తీవ్ర నేరం అవుతుంది. ఇటీవల మోహన్ బాబు తన ఇంట్లోకి దూసుకు వచ్చిన జర్నలిస్టుపై దాడి చేశారు. ఆ తర్వాత ఆయనను పరామర్శించేందుకు ఆస్పత్రికి వెళ్లారు. అది పెద్ద వివాదం అయింది. ఆయన ఫిర్యాదు దారుడును బెదిరించడానికో..త ప్రలోభ పెట్టడానికో వెళ్లారన్న విమర్శలు వచ్చాయి. పోలీసులు కూడా ఈ అంసాన్ని సీరియస్ గా తీసుకున్నారు. అయితే తాను కేవలం క్షమాపణ చెప్పడానికి వెళ్లానని మోహన్ బాబు కోర్టులో వాదించారు ఇక్కడ ఫిర్యాదుదారుడ్ని వంశీ అనుచరులు నేరుగా ఆయన ఇంటికి బలవంతంగా తీసుకెళ్లడం.. తర్వాత ఆజ్ఞాతంలో ఉంచడం వంటివి చూస్తే వల్లభనేని వంశీ విషయంలో పక్కా ఆధారాలతో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తులో వల్లభనేని వంశీకి చెందిన ఆర్థిక పరమైన వ్యవహారాలను కూడా పోలీసులు వెలికి తీస్తున్నట్లుగా తెలుస్తోంది. పోలీసులపై నిందలు వేయడంతో పోలీసులు మరింత సీరియస్ గా ఈ కేసును విచారణ జరుపుతున్నట్లుగా చెబుతున్నారు.

# హెల్మెట్... మోత

విజయవాడ, ఫిబ్రవరి 19,విజయవాడ వాసులకు ముఖ్య గమనిక. మార్చి ఒకటి నుంచి రూల్స్ మారనున్నాయి. నిబంధనలు పాటించకపోతే మీ జేబుకు చిల్లు పడే అవకాశం ఉంది. మార్చి ఒకటి నుంచి హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేయాలని విజయవాడ పోలీసులు నిర్ణయించారు. హెల్మెట్ ధరించకపోతే వేయి రూపాయలు జరిమానా విధించాలని నిర్ణయించారు. హెల్మెట్ వాడకంపై ఏపీ హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను పటిష్టంగా అమలు చేయాలని విజయవాడ పోలీసులు నిర్ణయించారు. ప్రస్తుతం విజయవాడలో అధికారిక లెక్కల ప్రకారం వందకు 75 మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తున్నారు. అయితే ఈ శాతాన్ని 75 నుంచి 95 శాతానికి పెంచాలని విజయవాడ పోలీసులు లక్ష్యంగా పెట్టుకున్నారు. 2025 మే ఆఖరి నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని పట్టుదలగా ఉన్నారు. ఈ నేపథ్యంలో హెల్మెట్ ధరించకపోతే భారీ జరిమానాలు విదించాలని నిర్ణయించారు.ప్రస్తుతం హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారికి రూ.135 జరిమానా విధిస్తున్నారు ట్రాఫిక్ పోలీసులు. అయితే మార్చి ఒకటి నుంచి ఈ మొత్తాన్ని రూ.1000లకు పెంచారు. రాష్ట్రంలో జరుగుతున్న ద్విచక్రవాహనాల రోడ్డు ప్రమాదాలపై ఏపీ హైకోర్టు ఇటీవల విచారణ జరిపింది. ఇలాంటి ప్రమాదాల్లో ఎక్కువ మంది చనిపోతూ ఉండటంపై ఆందోళన వ్యక్తం చేసింది. అయితే హెల్మెట్ ధరించి ఉంటే ఎక్కువ శాతం మంది బతికి ఉండేవారని కోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో హెల్మెట్ వాడకం తప్పనిసరి చేయాలని పోలీసులను ఏపీ హైకోర్టు ఆదేశించింది.ఈ నేపథ్యంలో విజయవాడ పోలీసులు కూడా హెల్మె?ట్ ధారణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నో హెల్మెట్, నో ఎంట్రీ విధానం కూడా తీసుకువచ్చారు. విజయవాడలోకి ప్రవేశించే మార్గాలైన ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గ వంతెన, అజిత్ సింగ్ నగర్ ప్రాంతాల్లో ఎంట్రీ పాయింట్ల వద్ద నిత్యం తనిఖీలు, ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. హెల్మె?ట్ లేకుండా బండి నడిపేవారిని హెచ్చరిస్తూ హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు.



# స్పోర్ట్స్ న్యూస్

## చాంపియన్స్ ట్రోఫీ.. టాస్ గెలిచిన పాకిస్థాన్.. న్యూజిలాండ్ ఫస్ట్ బ్యాటింగ్





కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ లో భాగంగా ఇవాళ పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య ఫస్ట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన పాక్ జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకున్నది. పాక్ కెప్టెన్ రిజ్వాన్ మాట్లాడుతూ.. రాత్రి వేళ తేమ ఉంటుందో కాబట్టి, దాన్ని వాడుకోవాలన్న ఉద్దేశంతో ఉన్నామని, డిఫెండింగ్ చాంపియన్ కావడం వల్ల కాస్త వత్తిడి ఉంటుందని కూడా పేర్కొన్నాడు. హరిస్ రౌఫ్ ఫిట్‌గా ఉన్నాడని, అతను ఈ మ్యాచ్‌లో ఆడుతున్నట్లు చెప్పాడు.

## శుభమన్ గిల్ నెంబర్ వన్ బ్యాటర్.. వన్డేల్లో టాప్ బౌలర్‌గా తీక్షణ



న్యూఢిల్లీ: ఐసీసీ మెన్స్ ప్లేయర్ ర్యాంకింగ్స్ రిలీజ్ చేశారు. చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇండియన్ స్టార్.. ఆ లిస్టులో టాప్ నిలిచాడు. రైట్ హ్యాండ్ బ్యాటర్ శుభమన్ గిల్(రాష్ట్రబీఎజీని ఉతిశ్రీశ్రీ).. వన్డేల్లో నెంబర్ వన్ బ్యాటర్ ర్యాంక్ సాధించాడు. పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌ను వెనక్కి నెట్టి గిల్ ఆ ప్లేస్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక వన్డేల్లో టాప్ బౌలర్‌గా శ్రీలంక స్పిన్నర్ మహేశ్ తీక్షణ నిలిచాడు. ఆఫ్ఘన్ బౌలర్ రషీద్ ఖాన్‌ను అతను వెనక్కినెట్టేశాడు. చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కావడానికి ముందు.. ఐసీసీ తాజా వన్డే ర్యాంక్ లిస్టును రిలీజ్ చేసింది.వన్డే క్రికెట్లో శుభమన్ గిల్ నెంబర్ వన్ ర్యాంక్‌లో నిలవడం ఇది రెండోసారి. 2023 ఐసీసీ వరల్డ్‌కప్ సమయంలోనూ.. బాబర్‌ను దాటేసి గిల్ ఆ ర్యాంక్‌ను పొందాడు. గిల్ ప్రస్తుతం టాప్ ఫామ్‌లో ఉన్నాడు. ఇంగ్లండ్‌తో అహ్మదాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ కొట్టాడు. ఇండియన్ బ్యాటర్ రోహిత్ శర్మ మూడవ స్థానంలో ఉన్నాడు. అయిదో స్థానికి కివీస్ ప్లేయర్ డారెల్ మిచెల్ చేరుకున్నాడు.టాప్ టెన్ ర్యాంకులో లంక బ్యాటర్ అసలంక కూడా చేరుకున్నాడు.బౌలర్ ర్యాంకింగ్స్‌లో లంక స్పిన్నర్ తీక్షణ దూసుకెళ్తున్నాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో ముగిసిన సిరీస్‌లోనూ అతను రాణించాడు. అయితే చాంపియన్స్ ట్రోఫీలో ఆ జట్టు పాల్గొనడం లేదు. కానీ ఇటీవల ఫామ్‌తో అతను అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. రెండో స్థానంలో ఆఫ్ఘన్ స్పిన్నర్ రిజ్వాన్ నిలిచాడు. నాలుగో స్థానంలో కుల్దీప్ యాదవ్, ఆరో స్థానంలో కేశవ్ మహారాజ్, ఏడో స్థానంలో మిచెల్ సాంట్నర్ ఉన్నారు.ఆఫ్ఘనిస్తాన్ ప్లేయర్ మహమ్మద్ నబీ .. వన్డే ఆల్‌రౌండర్ ర్యాంకుల్లో ఫస్ట్ ప్లేస్‌లో ఉన్నాడు. టాప్ టెన్‌లోకి సాంట్నర్ వచ్చేశాడు.

## దిగొచ్చిన పాక్.. కరాచీ స్టేడియంపై రెపరెపలాడిని భారత మువ్వన్నెల జెండా



ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నేటి నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ వెంట్ ప్రారంభానికి ముందుకు కరాచీ స్టేడియం పై భారత జాతీయ జెండా రెపరెపలాడింది. చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. ఐసీసీ నిబంధనల ప్రకారం ఏదైనా టోర్నీ జరుగుతున్న సమయంలో.. టోర్నీలో పాల్గొనే జట్లకు సంబంధించిన జెండాలను ఎగుర వేయాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా గడాఫీ స్టేడియంలో భారత జెండాను పాకిస్థాన్ విస్మరించింది.ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. పీసీబీ తీరుపై టీమ్ఇండియా అభిమానులు దుమ్మెత్తిపోశారు. దాయాది దేశం కావాలనే ఇలా చేసిందంటూ విమర్శలు చేశారు. మాజీ క్రికెటర్లు, పలువురు రాజకీయ నాయకులు సైతం పాక్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరపించారు. ఈ విమర్శలతో దిగొచ్చిన పాక్.. ఎట్టకేలకు కరాచీ స్టేడియంపై భారత మువ్వన్నెల జెండాను ఏర్పాటు చేసి వివాదానికి ముగింపు పలికింది.ఎనిమిదేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత క్రికెట్ అభిమానుల నిరీక్షణకు బుధవారంతో తెరపడనుంది. ప్రతిష్టాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి బుధవారం నుంచి తెరలేవనుంది. 1996 తర్వాత పాకిస్థాన్ లో జరుగుతున్న ఈ టోర్నీ నిర్వహణపై యావత్ దేశం భారీ అంచనాలే పెట్టుకుంది. 9వ ఎడిషన్‌గా జరుగబోయే ఈ టోర్నీని ఫిబ్రవరి 19 నుంచి మార్చి 09 దాకా పాకిస్థాన్, దుబాయ్‌లలో నిర్వహించనున్నారు. ఐసీసీ ఈవెంట్ హైబ్రిడ్ మోడల్‌లో జరుగుతున్న విషయం తెలిసిందే.ఇందులో భాగంగా భారత్ జట్టు మ్యాచులన్నీ దుబాయిలో ఆడుంది. మిగతా జట్టు మ్యాచ్‌లు పాక్‌లోని కరాచీ, లాహోర్, రావల్పిండిలో జరుగనున్నాయి. బుధవారం ఆతిథ్య పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య కరాచీ వేదికగా తొలి మ్యాచ్ జరుగనుంది. టోర్నీకి ప్రత్యేక ఆకర్షణ అయిన భారత్, పాకిస్థాన్ మ్యాచ్ ఈనెల 23న దుబాయ్‌లో జరుగుతుంది. మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు మొదలవుతాయి.వన్డేలలో ర్యాంకుల ఆధారంగా మొదటి 8 ర్యాంకులు కలిగిన దేశాలు ఆడనున్న ఈ టోర్నీలో జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-ఏలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, భారత్, న్యూజిలాండ్ ఉండగా గ్రూప్-బీలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్థాన్, ఇంగ్లండ్ ఉన్నాయి. రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో జరుగబోయే ఈ టోర్నీలో భాగంగా గ్రూప్ దశ (మొత్తం 12 మ్యాచ్‌లు)లో ప్రతి జట్టు తమ గ్రూపులోని ఇతర జట్లతో ఒక మ్యాచ్ ఆడుతుంది. 19 నుంచి వచ్చే నెల 02 దాకా గ్రూప్ దశ మ్యాచ్‌లు జరుగనుండగా ఈ దశలో టాప్-2లో నిలిచిన రెండు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. దుబాయ్‌లో తొలి, లాహోర్‌లో రెండో సెమీస్ జరుగుతుంది. ఒకవేళ భారత్ ఫైనల్‌కు చేరితే టైటిల్ పోరు దుబాయ్‌లోనే జరుగుతుంది.

## చాంపియన్స్ ట్రోఫీలో అరుదైన ఘనత సాధించేందుకు రెడీ అయిన విరాట్ కోహ్లీ..!




భారత జట్టు స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ అరుదైన ఘనత సాధించేందుకు రెడీ అయ్యాడు. చాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచే అవకాశం ఉన్నది. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్నది. టీమిండియా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో ఆడనున్నది. ఐసీసీ టోర్నీల్లో మంచి రికార్డు ఉన్న కోహ్లీ నుంచి భారత జట్టు ఈ సారి సైతం మంచి ఇన్నింగ్స్‌ను ఆశిస్తున్నది. అయితే, ఇటీవల ఫామ్ లేమితో ఇబ్బందులుపడుతుండగా.. ఇంగ్లాండ్‌తో జరిగిన చివరి వన్డేలో అర్ధ సెంచరీ చేయడం భారత్‌కు ఊరటనిస్తున్నది. చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తుండగా.. టీమిండియా మ్యాచులన్నీ దుబాయిలో జరుగనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్స్ పాకిస్థాన్, భారత్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ గ్రూప్-ఏలో ఉన్నాయి. ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ గ్రూప్-బీలో ఉన్నాయి. చాంపియన్స్ ట్రోఫీకి 2009 నుంచి 2017 వరకు ప్రతి నాలుగు సంవత్సరాలకోసారి జరిగింది. కానీ, తర్వాత కొవిడ్ మహమ్మారి తర్వాత వాయిదాపడింది. ఈ టోర్నీ 1998లో ప్రారంభమైంది. ప్రతి రెండు సంవత్సరాలకోసారి నిర్వహించింది.ఇక ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన రికార్డు వెస్టిండీస్ దిగ్గజ బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ పేరిట ఉన్నది. ఈ టోర్నీలో 17 మ్యాచుల్లో 52.73 సగటుతో 88.77 స్ట్రయిక్ రేట్‌తో 791 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ ఉంది. గేల్ రికార్డును కోహ్లీ బద్దలు కొట్టే అవకాశం ఉంది. విరాట్ చాంపియన్స్ ట్రోఫీలో 13 మ్యాచుల్లో 88.16 సగటు, 92.32 స్ట్రయిక్ రేట్‌తో 529 పరుగులు చేశాడు. ఇందులో ఐదు హాఫ్ సెంచరీలున్నాయి. ఈ టోర్నమెంట్‌లో కోహ్లీ అత్యధిక వ్యక్తిగత స్కోరు 96 నాటౌట్. 2017లో బంగ్లాదేశ్‌పై ఈ స్కోర్‌ను చేయగలిగాడు. పాకిస్థాన్‌పై 81 నాటౌట్, దక్షిణాఫ్రికాపై 76 నాటౌట్‌గా నిలిచాడు. గేల్ రికార్డుకు కోహ్లీ ఇంకా 263 పరుగుల దూరంలో ఉన్నాడు. ఈ పరుగులు చేస్తే.. ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలుస్తాడు. క్రిస్ గేల్ 791 (17 మ్యాచులు), మహేలా జయవర్ధనే 742 (22), శిఖర్ ధావన్ 701 (10), కుమార్ సంగక్కర 683 (22), సౌరవ్ గంగూలీ 665 (13), జాక్వెస్ కల్లిస్ 653 (17), రాహుల్ ద్రవిడ్ 627 (19), రికీ పాంటింగ్ 593 (18), శివ్ నారాయణ్ చందర్‌పాల్ 587 (16), సనత్ జయసూర్య 536 (20), విరాట్ కోహ్లీ 529 (13) పరుగులు చేశాడు. కోహ్లీ కొంతకాలంగా ఫామ్ లేమితో ఇబ్బందులుపడుతున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆకట్టుకోలేకపోయాడు. కోహ్లీ 12 సంవత్సరాల తర్వాత రంజీ ట్రోఫీలో ఎంట్రీ ఇచ్చినా.. రాణించలేకపోయాడు. మోకాలి వాపు కారణంగా ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలో ఆడలేకపోయాడు. రెండో మ్యాచ్‌లోనూ విఫలమయ్యాడు. మూడో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ సాధించాడు.

## చాంపియన్స్ ట్రోఫీలో ఈ అయిదుగురు ఆటగాళ్లపై ఫోకస్ పెట్టాల్సిందే..

కరాచీ: పాకిస్థాన్ వేదికగా మరికొన్ని క్షణాల్లో చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభంకానున్నది. ఐసీసీ నిర్వహిస్తున్న ఆ వన్డే టోర్నీలో 8 జట్లు పోటీపడుతున్నాయి. 29 ఏళ్ల తర్వాత మళ్లీ పాక్ వేదికగా ఐసీసీ టోర్నీ జరుగుతోంది. కరాచీ వేదికగా మరికాసేపట్లో పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య మ్యాచ్ ప్రారంభంకానున్నది. అయితే ఈ వన్డే టోర్నమెంట్‌లో అయిదుగురు క్రికెటర్లు కీలకం కానున్నారు. ఆ క్రికెటర్లు ఎవరో తెలుసుకుందాం.భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిపై అందరి కన్ను ఉంది. ఈ టోర్నీలో ఇతను సత్తా చాటే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. భారత బౌలింగ్ లైనప్‌కు వరుణ్ మరింత బలాన్ని ఇచ్చే అవకాశం ఉన్నది. దుబాయ్ స్లో పిచ్ ఇతనికి అనుకూలించే అవకాశాలు ఉన్నాయి. కొన్ని రోజుల క్రితం ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అతను అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో అతను 14 వికెట్లు తీసుకున్నాడు. గత ఏడాది ఐపీఎల్‌లో కూడా అతను అద్భుతగా బౌల్ చేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున అతను 21 వికెట్లు తీసుకున్నాడు. కోచ్ గౌతం గంభీర్ అతనిపై గంపెడు ఆశలు పెట్టుకున్నాడు.పాకిస్థాన్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ తయ్యబ్ తాహిర్ ఈ టోర్నీలో రాణిస్తాడని భావిస్తున్నారు. ఈ మధ్య టాప్ ఫామ్‌లో ఉన్న అతను.. భారీగా పరుగులు చేయగలడన్న విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. 2023 ఎమర్జింగ్ టీమ్స్ ఆసియాకప్ ఫైనల్లో అతను సెంచరీతో చెలరేగాడు. 31 ఏళ్ల తయ్యబ్.. ఇటీవల స్వదేశీ క్రికెట్‌లో కూడా పరుగుల వరద సృష్టించాడు. గత ఏడాది పాక్ వన్డేల్లో అరంగేట్రం చేశాడు. తయ్యబ్ కీలక ప్లేయర్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నట్లు బౌలింగ్ దిగ్గజం వసీం అక్రమ్ పేర్కొన్నాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో అతను అద్భుతమైన ట్యాలెంట్ ప్రదర్శించినట్లు మెచ్చుకున్నాడు.టామ్ బాంటన్ బ్యాటర్ టామ్ బాంటన్‌పై ఇంగ్లండ్ ఆశలు పెట్టుకున్నాడు. ఇండియాతో సిరీస్‌లోనే అతను అరంగేట్రం చేశాడు. సిరీస్ చివరి మ్యాచ్‌లో అతను 38 రన్స్ చేశాడు. ఆ 26 ఏళ్ల బ్యాటర్ అహ్మదాబాద్ మ్యాచ్‌లో మూడవ నెంబర్‌లో ఆడాడు. గాయపడ్డ జాక్ బేతల్ స్థానంలో అతన్ని తీసుకున్నారు. చాంపియన్స్ ట్రోఫీకి కూడా అతన్ని తీసుకున్నారు. ఇండియాతో మ్యాచ్‌లో అతను సుందర్ బౌలింగ్ భారీ సిక్సర్ కొట్టాడు. అయితే టీ20 క్రికెట్‌లో అతను మంచి ఫామ్‌లో ఉన్నాడు. యూఏఈ ప్రీమియర్ లీగ్‌లో అతను లీడింగ్ రన్ స్కోరర్‌గా ఉన్నాడు. 11 ఇన్నింగ్స్‌లో అతను 493 రన్స్ చేశాడు. దాంట్లో రెండు సెంచరీలు ఉన్నాయి.ఆరన్ హర్డై ఆస్ట్రేలియాకు చెందిన 26 ఏళ్ల ఆరన్ హర్డై కూడా స్పెషల్ ఫోకస్‌గా మారాడు. మార్కస్ స్టోయినిస్ సడెన్‌గా రిటైర్మెంట్ ప్రకటించడంతో.. ఆల్‌రౌండర్ పాత్రను ఆరన్ హర్డై పోషించనున్నాడు. రైట్ ఆర్మ్ పేస్ బౌలింగ్ చేయగలడు. బ్యాటింగ్‌లో చాలా పవర్‌ఫుల్ షాట్స్ ఆడుతాడు.

## చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ ఫేవరేట్‌గా భారత్..! టీమిండియా బలం, బలహీనతలు ఇవే..!

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి సమయం దగ్గరపడింది. ఐసీసీ ఈవెంట్ బుధవారం నుంచి మొదలుకానున్నది. హైబ్రిడ్ మోడల్‌లో పాకిస్తాన్, దుబాయిలో జరుగనున్నాయి. భారత జట్టు అన్ని మ్యాచులన్నీ దుబాయిలోనే ఆడనున్నది. 50 ఓవర్ల టోర్నీలో భారత్, పాకిస్థాన్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు బరిలోకి దిగబోతున్నాయి. భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ గ్రూప్-ఏలో ఉన్నాయి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్, ఇంగ్లాండ్ జట్లు గ్రూప్-బీలో ఉన్నాయి.టీమిండియా బలం ఇదే..టీమిండియా ఈ మెగా ఈవెంట్‌లో టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నది. దక్షిణాఫ్రికా, పాకిస్తాన్‌లతో పాటు భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీలో టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నది. బ్యాటింగ్, స్పిన్ బౌలింగ్‌లో టీమిండియా బలంగానే ఉంది. చాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియా సొంత మైదానంలో ఇంగ్లాండ్ 3-0 తేడాతో ఓడించి.. ప్రత్యర్థులకు టైటిల్ ఫేవరేట్ రేసులో ఉన్నామని సంకేతాలు పంపింది. కెప్టెన్ రోహిత్ శర్మ సెంచరీ చేయగా.. విరాట్ సైతం టచ్‌లోకి వచ్చాడు. యువ బ్యాట్స్‌మన్ శుభ్‌మాన్ గిల్ అద్భుతమైన లయలో ఉన్నాడు. శ్రేయాస్ అయ్యర్ మిడిలార్డర్‌లో టీమిండియా బలంగానే ఉంది.స్పిన్ బలంగానే..బౌలింగ్‌లో రవీంద్ర జడేజా, కుల్దీప్, అక్షర్, వరుణ్ చక్రవర్తితో భారత స్పిన్ విభాగం బలంగా కనిపిస్తోంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో పాటు, బంగ్లాదేశ్, న్యూజిలాండ్, భారతదేశం గ్రూప్-ఏలో ఉన్నాయి. భారత్ రెండుసార్లు చాంపియన్స్ ట్రోఫీని గెలిచింది. చివరిసారిగా 2013లో ఇంగ్లాండ్‌తో చాంపియన్స్ ట్రోఫీని గెలించింది. 2002లో శ్రీలంకతో కలిసి సంయుక్తంగా విజేతగా నిలిచింది. గత రెండు సార్లు ఫైనల్స్‌కు చేరిన టీమిండియా భారత జట్టు విజయశాతం 69.2శాతంగా ఉన్నది. ఇప్పటి వరకు 29 మ్యాచులు ఆడి.. 19 మ్యాచులు గెలిచింది.బలహీనంగా ఫాస్ట్ బౌలింగ్..ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా లేకపోవడం ఖచ్చితంగా టీమిండియాకు పెద్ద లోటుగా మారింది. ఇటీవల కాలంలో మూడు ఫార్మాట్లలో టీమిండియాకు బుమ్రాకు మ్యాచ్ విన్నర్‌గా నిలిచాడు. బుమ్రా గైర్హాజరీలో మహమ్మద్ షమీ జట్టులో సీనియర్ ఫాస్ట్ బౌలర్ టీమిండియా బౌలింగ్ భారాన్ని మోయనున్నాడు. గాయం కారణంగా చాలారోజుల పాటు టీమిండియాకు దూరమైన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు ఎంపికయ్యాడు. ఇక వరుణ్ చక్రవర్తి భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. మిస్టరీ స్పిన్నర్ ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుతమైన రాణించాడు. దాంతో భారత జట్టు వన్డేలో చోటు సంపాదించాడు. గత సంవత్సరం ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్ మినహాయించి.. ఇటీవల సంవత్సరాల్లో భారత ఐసీసీ టోర్నీ ఫైనల్స్‌లో తడబడింది.

# ప్లాస్టిక్ బాక్సుల్లో ఆహారం తింటున్నారా? మీ ఆరోగ్యాన్ని దేవుడు కూడా కాపాడలేడు!



చెడు కొలెస్ట్రాల్ సమస్య ఇప్పుడు చాలామందికి అతి పెద్ద సమస్యగా మారింది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయి .ముఖ్యంగా గుండెపోటు, చెడు కొలెస్ట్రాల్ సమస్యతోనే వస్తుంది. మన ఆహారపు అలవాట్లు, జీవనశైలి, ఒత్తిడితో కూడుకున్న జీవితం వెరసి లెక్కకు మిక్కిలి చెడు కొలెస్ట్రాల్ తో బాధపడుతున్నారు. ప్లాస్టిక్ డబ్బాలలో ఆహారం ప్రస్తుతం మనం చాలా హానికరమైన పరిస్థితుల మధ్య బ్రతుకుతున్నాం. ప్రతి దానికి మనం ప్లాస్టిక్ ను ఎక్కువగా వినియోగించడం మన ఆరోగ్యానికి, మన మనుగడకే ముప్పు తెస్తుంది. ప్లాస్టిక్ టీ కప్పులు, సంచులు, డబ్బాలు, టిఫిన్ బాక్సులు ఇలా ఒకటేమిటి, ఎక్కడ చూసినా మనం ప్లాస్టిక్ నే ఉపయోగిస్తున్న పరిస్థితి ఉంది. అంతేకాదు బయట హోటల్స్ లో ఫుడ్ ఆర్డర్ పెట్టుకున్న ప్లాస్టిక్ డబ్బాలలో వారు వేడివేడి ఆహారాన్ని పంపిస్తున్నారు. ప్లాస్టిక్ కంటైనర్లో పెట్టిన ఆహారంతో పేగులు డ్యామేజ్ స్కూల్స్, కళాశాలలకు వెళ్లే చిన్నారులకు కూడా ప్లాస్టిక్ కంటైనర్లలో ఆహారాన్ని పెట్టి పంపిస్తున్న పరిస్థితి ఉంది. అయితే ప్లాస్టిక్ కంటైనర్లలో పెట్టిన వేడివేడి ఆహారాన్ని తినడం ఎంత మాత్రం మంచిది కాదని పరిశోధకులు చెబుతున్నారు. ప్లాస్టిక్ డబ్బాలలో ఉండే మైక్రో ప్లాస్టిక్ వేడివేడి ఆహారాన్ని అందులో వేసినప్పుడు ఆహారంలోకి చేరి మన ప్రేగులలోకి వెళుతుందని ఇది మన ప్రేగులలో సున్నితమైన పైపొరను డామేజ్ చేస్తుందని చెబుతున్నారు. గుండె జబ్బుల రిస్క్ ప్లాస్టిక్ కంటైనర్లలో తినడం కారణంగా కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్ రిస్క్ కూడా అధికంగా ఉంటుందని చాలా మంది పరిశోధకులు వెల్లడించారు. ప్లాస్టిక్ కంటైనర్లలో ఫుడ్ తినడం కారణంగా రక్తప్రసరణ దెబ్బతింటుందని, ఫలితంగా గుండెజబ్బుల ప్రమాదం పెరుగుతుందని కూడా హెచ్చరిస్తున్నారు. ఎవరైతే గుండెజబ్బులతో బాధపడతారో వారు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా ఆపేయాలని కూడా చెబుతున్నారు. క్యాన్సర్ రిస్క్ ప్లాస్టిక్ బాక్స్ లో ఉండే మైక్రో ప్లాస్టిక్ కడుపులోకి వెళితే క్యాన్సర్ వంటి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ డబ్బాలలో తినే కంటే స్టెయిన్లెస్ స్టీల్ కంటైనర్లు ఆహారం పెట్టుకోవడానికి, తినడానికి చాలా మంచిదని చెబుతున్నారు. గ్లాస్ కంటైనర్లు వినియోగించినా మంచిదేనని చెబుతున్నారు. ప్లాస్టిక్ వాటర్ బాటిల్ కంటే కాపర్, స్టీల్ వాటర్ బాటిల్స్ వాడడం మంచిదని చెబుతున్నారు. పర్యావరణానికి అనుకూలంగా ఉండే టిఫిన్ బాక్స్ లను, కంటైనర్లను ఆహారాన్ని పెట్టుకోవడానికి తినడానికి వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.


# ఆహారంలో దీనిని చేర్చుకుంటే రోగాలు పరార్!

చాలామంది రకరకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉంటారు. నొప్పులు, వాపులు, జీర్ణ సమస్యలు ఇలా రకరకాల సమస్యలతో సతమతమవుతూ ఉంటారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఒక మంచి అద్భుతమైన పదార్థం . మీ ఆరోగ్యాన్ని పెంచడానికి ఇది ఎంతగానో దోహదం చేస్తుంది. ఇక ఆ పదార్థం ఏమిటి? దానిని ఎలా ఉపయోగించాలి? ప్రస్తుతం తెలుసుకుందాం. ఆహారంలో ఇంగువతో బోలెడు లాభాలు అనారోగ్యంతో బాధపడేవారు ఆహారంలో కొంచెం ఇంగువను చేర్చుకుంటే బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఇంగువ ఆహారం రుచిని బాగా పెంచుతుంది. శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. ఇంగువ అనేక అద్భుత గుణాలున్న ఆయుర్వేద మొక్క నుండి తయారు చేస్తారు. ఫెరులా అని పిలిచే మొక్క కాండం, వేర్ల నుంచి వచ్చే రసంతో ఇంగువను తయారు చేస్తారు. ఇంగువతో నొప్పులు, వాపులు మాయం ఇంగువ పేగు కండరాలను బలోపేతం చేయడంలోనూ, గ్యాస్ సమస్యలను, కడుపు ఉబ్బరాన్ని తగ్గించడంలోనూ ఎంతో బాగా పనిచేస్తుంది, నొప్పులు, వాపులు వంటి సమస్యలను తగ్గించడంలో కూడా ఇంగువ ఎంతో కీలక భూమిక పోషిస్తుంది. ఇంగువలో యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉంటాయి. ఇవి మన శరీరంలో ఫ్రీ రాడికల్స్ వల్ల శరీరకణాలకు కలిగే నష్టం నుండి మనలను కాపాడతాయి. శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం సాంప్రదాయ వైద్యంలో ఇంగువను ఆస్తమా, బ్రాంకైటిస్, దగ్గు వంటి సమస్యలను తగ్గించడానికి ఉపయోగిస్తారు. శ్వాసకోశ సమస్యలను తగ్గించటానికి ఇంగువ ఎంతగానో దోహదం చేస్తుంది. ఆహారంలో ఇంగువ తీసుకోవడం మాత్రమే కాదు, గోరువెచ్చని నీటితో కూడా ఇంగువను తీసుకోవడం వల్ల శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ప్రతిరోజు మనం ఇంగువను తీసుకుంటే అది మన రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఇంగువతో ఇన్ఫెక్షన్లు దూరం ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే అసౌకర్యాలను పరిష్కరించడంలో ఇంగువ ఎంతో బాగా పనిచేస్తుంది. ఇంగువలో ఉండే యాంటీ స్పాస్మోడిక్ లక్షణాలు మన గర్భాశయ కండరాలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలను ఆహారంలో భాగంగా చేసుకుంటే అనేక అనారోగ్య సమస్యలకు చక్కని పరిష్కారం లభిస్తుంది.




# శృంగార సామర్థ్యం పెంచి, మూడొందల రోగాలను తగ్గించే ఆకు ఇదే.. వదిలిపెట్టొద్దు!

ప్రకృతిలో మనకు నిత్యం కనిపించే అనేక చెట్లు మనకు ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తాయి. అలా ఆరోగ్యాన్ని ఇచ్చే వాటిలో ముఖ్యంగా మునగాకును గురించి తప్పక చెప్పుకోవాలి. మన ఆరోగ్యాన్ని బాగుచేసే సూపర్ గుణాలు మునగాకులో పుష్కలంగా ఉన్నాయి అంటే నమ్మి తీరాలి. మునగాకులో జబ్బులు తగ్గించే గొప్ప గుణాలు మునగాకులో 300 జబ్బులు నయం చేసే గొప్ప లక్షణాలు ఉన్నాయి అంటే అతిశయోక్తి కాదు. అంత గొప్ప గుణాలున్న మునగాకును చాలామంది ఆహారంలో భాగంగా చేర్చుకుంటున్నారు. మునగాకు గొప్పతనం తెలిసిన వారెవరు దానిని చాలా ముఖ్యమైన ఆహారంగా చూస్తారు. మునగాకు తో పచ్చడి, పప్పు ఇలా రకరకాలుగా మనం తినే ఆహారంలో చేర్చుకోవచ్చు. మునగాకును మన ఆహారంలో భాగంగా చేసుకుంటే అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.! మునగాకులో పుష్కలంగా పోషకాలు మునగాకులో విటమిన్ సి అధికంగా ఉంటుంది. మునగాకులో చాలా ముఖ్యమైన విటమిన్లు, మినరల్స్ మన శరీరానికి కావలసిన ఖనిజలవణాలు ఉంటాయి. అలాగే పొటాషియం, కాల్షియం, ఐరన్, ప్రోటీన్, అమైనోయాసిడ్లు కూడా మునగాకులో ఉంటాయి. మునగాకులో అత్యధిక పోషకాలతో పాటు ఔషధ గుణాలు బాగా ఉండటంతో ఇది అద్భుతమైన మెడిసిన్ లాగా పని చేస్తుందని చెప్పొచ్చు. మునగాకుతో ఈ ఆరోగ్య ప్రయోజనాలు మునగాకు అనేక రోగాలను నయం చేయడంలోనూ,మన శరీరంలో కండరాలకు శక్తిని ఇవ్వడంలోనూ బ్రహ్మాండంగా పనిచేస్తుంది. మన రోగనిరోధక శక్తిని పెంచి శరీరాన్ని రోగాల నుండి కాపాడుతుంది. రక్తపోటును మునగాకు గణనీయంగా తగ్గిస్తుంది. మునగాకులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ లు, అద్భుత గుణాల వల్ల శరీరానికి మేలు జరుగుతుంది. మన శరీరంలో ఉన్న చెడు కొవ్వును కూడా బాగా మునగాకు తగ్గిస్తుంది. మునగాకుకు రక్త నాళాలలో పేరుకుపోయిన కొవ్వును సైతం కరిగించే సామర్థ్యం ఉంది. డయాబెటిస్ కంట్రోల్.. నొప్పులు, వాపులకు చెక్ మునగాకుతో రక్తంలో చక్కెరను తగ్గించవచ్చు. డయాబెటిస్ ను అదుపులోకి తీసుకురావడంలో మునగాకు చాలా బాగా పని చేస్తుంది. మునగాకు ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తుంది. మునగాకు నొప్పులు, వాపులు, గాయాలను తగ్గిస్తుంది. మునగాకు మన మెదడులోని ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యానికి కారణమవుతుంది. కంటి చూపు మందగించిన వారిలోనూ మునగాకు కంటి చూపుని మెరుగుపరచడానికి ఎంతగానో ఉపయోగపడుతుందికిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఇవి తప్పనిసరి.. మిస్ చేశారో మీ జీవితం ముగిసినట్లే!" మునగాకుతో శృంగార సామర్థ్యం పెంపు మునగాకు మగవారిలో శృంగార సామర్థ్యాన్ని పెంచుతుంది. వారానికి కనీసం రెండుసార్లు ఏదో ఒక రూపంలో మునగాకును తీసుకుంటే ఆరోగ్యానికి తిరుగుండదని చెప్తారు. ఎన్నో గొప్ప పోషకాలు, గొప్ప ఆరోగ్య గుణాలు ఉన్న మునగాకును ఆహారంలో భాగం చేసుకోండి. సంతోషంగా జీవించండి.



# మూత్రంలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా? అయితే అలెర్ట్!

మూత్ర విసర్జన ప్రతి మనిషికి చాలా ముఖ్యమైనది. మూత్రం రావడం, మూత్రం యొక్క పరిమాణం, దాని స్వభావం, మూత్రం యొక్క రంగు బట్టి మూత్ర విసర్జనను కొన్ని రకాలుగా వర్గీకరించారు. మూత్రం లక్షణాలను బట్టి మూత్ర విసర్జన సమస్యలను కూడా గుర్తించవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. అతి మూత్ర విసర్జన సమస్య చాలామందికి మూత్రం ఎక్కువగా వస్తూ ఉంటుంది. ఇలా మూత్రం ఎక్కువగా రావడాన్ని పాలీ యూరియా అంటారు. మూత్రం అతిగా రావడం, పదేపదే ముత్రానికి వెళ్లాల్సి రావడం, మూత్రం పరిమాణం కూడా ఎక్కువగా ఉండటం వంటి లక్షణాలను పాలి యూరియా అంటారు. ఈ సమస్య ఎక్కువగా ఉన్నవారు డయాబెటిస్ బాధితులుగా మారతారు.! తక్కువ మూత్ర విసర్జన సమస్య మూత్రం తక్కువగా రావడాన్ని అనురియా అని చెబుతారు. అంటే ఒక మనిషి శరీరంలో ఒక రోజు తయారు కావలసిన మూత్రం కంటే తక్కువ మూత్రం తయారు అయితే ఆ పరిస్థితిని అనురియా అంటారు. అయితే మూత్రం తక్కువ రావడం శరీరం యొక్క డీహైడ్రేషన్ ను సూచిస్తుంది. ఇది కూడా అనారోగ్య సమస్య గానే పరిగణించాలి. మూత్రంలో అల్బుమిన్ అనే ప్రోటీన్ పోవటం శరీరంలోని వ్యర్థ పదార్థాలు పోవాలంటే ప్రతిరోజు మన శరీరంలో 300 నుండి 500 మిల్లీమీటర్ల మూత్రం తయారు కావాలి. అంతకంటే తగ్గితే దానిని అనురియాగా పరిగణించాలి. మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోవడం వల్ల ఈ సమస్య వస్తుంది. మూత్రంలో అల్బుమిన్ అనే ప్రోటీన్ పదార్థం పోవడాన్ని అల్బుమినూరియా అంటారు. ఈ సమస్య నెఫ్రైటిస్, డయాబెటిస్, నెఫ్రోటిక్ సిండ్రోమ్, కొంతమందికి కాన్పుకు ముందు వచ్చే గుర్రపు వాతం వంటి సమస్యలతో వస్తుంది. 5 5 మూత్రంలో గ్లూకోజ్, రక్తం పోతే మనిషి శరీరంలో రక్తంలో ఎక్కువ గ్లూకోజ్ ఉంటే మూత్రంలో కూడా గ్లూకోజ్ పోయే పరిస్థితిని గ్లైకోసూరియా అంటారు. ఇక మూత్రంలో రక్తం పోయే పరిస్థితి ఉంటే దానిని హేమచురియా అంటారు. మూత్రపిండంలో రాళ్లు ఉంటే, మూత్రనాళాలకు గాయాలు అయితే లేదా ఏదైనా ఇన్ఫెక్షన్లు వస్తే ఈ సమస్య వస్తుంది. ఇక పుట్టుకతోనే మూత్రపిండాలు జబ్బుల వల్ల, మూత్రపిండాల క్యాన్సర్, ప్రోస్టేట్ సమస్యలు, చికిత్సల కారణంగా కూడా హెమచురియా వస్తుంది. ఖీవఇనీఎఎవనిటవట ఈనీతీ జనీబీ "జుట్టు రాలడానికి అసలు కారణం ఇదే? వారంలో ఎన్ని సార్లు తలస్నానం చేయాలో తెలుసా?" మూత్రంలో చీము, అనేక మూత్ర సమస్యలు మూత్రంలో చీము పోయే పరిస్థితిని పయూరియా అంటారు. ఇలాంటి పరిస్థితి ఉన్నప్పుడు నడుం నొప్పి, మూత్రం పోసే సమయంలో విపరీతమైన నొప్పి వస్తాయి. ఇది మాత్రమే కాకుండా మూత్రం రంగును బట్టి దాని కల్చర్ ను బట్టి, మూత్రం యొక్క సెన్సిటివిటీని బట్టి మూత్ర సమస్యలను నిర్ధారిస్తారు . ఇక ఇటువంటి అనేక మూత్ర సమస్యలకు నిర్దిష్ట కారణాలను గుర్తించి తదనుగుణంగా చికిత్స చేయాల్సి ఉంటుంది.





# సినిమా



## తమిళ యంగ్ హీరోతో మైత్రీ మూవీ మేకర్స్



మంచి అభిరుచి గల నిర్మాణ సంస్థగా మైత్రీ మూవీ మేకర్స్ పేరు పొందింది. శ్రీమంతుడు సినిమాతో తమ జర్నీని మొదలుపెట్టిన నిర్మాతలు అతి తక్కువ కాలంలోనే మంచి నిర్మాతలుగా పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో ఉన్న పెద్ద నిర్మాణ సంస్థల్లో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ కూడా ఒకటి. ఆ బ్యానర్ నుంచి సినిమా వస్తుందంటే అందరి దృష్టి దానిపైనే ఉంటుంది. దాదాపు తెలుగులోని స్టార్ హీరోలందరితో సినిమాలు చేసిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ రీసెంట్ గా పుష్ప2 తో నెక్ట్స్ లెవెల్ హిట్ ను అందుకున్న విషయం తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద పుష్ప2 చేసిన హడావిడి, హంగామా అంతా ఇంతా కాదు. ఈ సినిమా తర్వాత మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ స్థాయి మరికొంచెం పెరిగిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఓ వైపు సినిమాలను నిర్మిస్తూనే మరోవైపు డిస్ట్రిబ్యూషన్ లో కూడా మైత్రీ సంస్థ దూసుకెళ్తుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళంలో, హిందీలో కూడా తమ సంస్థను వ్యాపింపచేస్తున్నారు మైత్రీ నిర్మాతలు నవీన్, రవి శంకర్. ఇప్పటికే తమిళంలో అజిత్ తో గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమా తీస్తున్న మైత్రీ, హిందీలో సన్నీ డియోల్ తో జాత్ ను నిర్మిస్తుంది. ఆల్రెడీ అజిత్ మూవీతో కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన మైత్రీ సంస్థ ఇప్పుడు తమిళంలో ఓ యంగ్ హీరోతో సినిమా చేయనుంది. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా ఓ సినిమాను చేస్తున్నట్టు మైత్రీ నిర్మాతల్లో ఒకరైన రవి శంకర్ అనౌన్స్ చేశారు. ఆల్రెడీ ఈ సినిమాకు సంబంధించిన 20 రోజుల షూటింగ్ కూడా పూర్తైందట. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ తో పాటూ టైటిల్ ను రివీల్ చేయనున్నామని, ప్రదీప్ తో చేయబోయే కథ ఎంతో అద్భుతంగా ఉంటుందని నిర్మాత రవి తెలిపారు. ఇది కాకుండా మైత్రీ బ్యానర్ లో ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్టులు సెట్స్ పై ఉన్నాయి. ప్రభాస్- హను రాఘవపూడి సినిమాతో పాటూ, హరీష్ శంకర్- పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్‌సింగ్ కూడా ఇదే బ్యానర్ లో తెరకెక్కుతున్న విషయం తెలిసిందే.

## బ్లాస్ట్ అయిన ఎస్.కె 23..ఎలివేషన్ ఓ రేంజ్ లో!

కోలీవుడ్ స్టార్ శివ కార్తికేయన్ ఇటీవలే 'అమరన్' తో భారీ బ్లాక్ బస్టర్ అందుకున్న సంగతి తెలిసిందే. శివ కార్తికేయన్ కెరీర్ లో భారీ వసూళు సాధించిన తొలి చిత్రమిది. తమిళ్ తో పాటు తెలుగులోనూ మంచి వసూళ్లను సాధించింది. ప్రస్తుతం శివకార్తికేయన్ 23వ చిత్రం క్రియేటివ్ డైరెక్టర్ మురగదాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఆన్ సెట్స్ లో ఉందీ చిత్రం. ఈసినిమాకి మురగదాస్ ఎలాంటి టైటిల్ పెడతాడని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమా ఈ నేపథ్యంలో వాళ్ల అంచనాలు సంచలనాలు అయ్యేలా 'మదరాసి' అనే క్రేజీ టైటిల్ ని ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. గ్లింప్స్ లో పవర్ ఫుల్ యాక్షన్ ఎపిసోడ్ తో నింపేసారు. కార్ చేజింగ్ సన్నివేశాలు...బ్లాస్టింగ్స్ సీన్స్ తో గ్లింప్స్ అదిరిపోయింది. బాంబుల మోతలు, తుపాకీ గుళ్ల వర్షంతో ఎస్ ..కె 23 హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్ టైనర్ అని తెలుస్తుంది. శివ కార్తికేయన్ ఎలివేషన్ ఓ రేంజ్ లో ఉంది. గజినీ'లో సూర్య తరహాలోనే శివ కార్తికేయన్ రోల్ ని డిజైన్ చేసినట్లు కనిపిస్తుంది. డార్క్ సన్నివేశం ఆకట్టుకుంటుంది. అనిరుద్ బీజీఎమ్ తో మరోసారి హైలైట్ అవుతుంది. ప్రస్తుతం గ్లింప్స్ నెట్టింట వైరల్ అవుతుంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తయింది.



ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగు తున్నాయి. భారీ యాక్షన్ సన్నివేశాలు ఉండటంతో విజువల్ ఎఫెక్ట్స్ ప్రాధాన్యత కనిపిస్తుంది. పాన్ ఇండియాలో ఈ చిత్రం వేసవిలో రిలీజ్ అవుతుంది. శ్రీలక్ష్మీ మూవీస్ బ్యానర్ పై సుందర్ రాజా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో పాటు, మురగదాస్ బాలీవుడ్ లో సల్మాన్ ఖాన్ హీరోగా 'సికిందర్' చిత్రాన్ని కూడా తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ కూడా ముగింపు దశకు చేరుకుంది.

## మాస్ కా దాస్ కి జోడీగా బుల్లెట్ బేబీ!




ముంబై బ్యూటీ కృతి శెట్టి టాలీవుడ్ లో పెద్ద హీరోయిన్ అవుతందనుకున్నారంతా. కానీ అమ్మడి కెరీర్ అలా సాగలేదు. 'ఉప్పెన'తో అలరించినా? అటుపై నటించిన సినిమాలు వైఫల్యాలు బాట పట్టడంతో అవకాశాలు తగ్గాయి. దీంతో కోలీవుడ్, మాలీవుడ్ బాట పట్టింది. అక్కడ మాత్రం కాస్త బిజీగానే ఉంది. కోలీవుడ్ లో ఎక్కువగా సినిమాలు చేస్తుంది. అలాగని టాలీవుడ్ కి పూర్తిగా దూరం కాలేదు. అడపా దడపా తెలుగు సినిమాలు చేస్తోంది. . కానీ ఆ సినిమా ఫలితం కూడా నిరాశ పరిచింది. ఆ తర్వాత మళ్లీ టాలీవుడ్ లో సినిమా చేయలేదు. ఈ నేపథ్యంలో అమ్మడికి మరోసారి కంబ్యాక్ అయ్యే ఛాన్స్ వచ్చింది. యంగ్ హీరో విశ్వక్ సేన్ హీరోగా సితార ఎంటర్ టైన్ మెంట్స్ ఓ సినిమాకి సన్నాహాలు చేస్తోంది. ఇందులో హీరోయిన్ గా కృతిశెట్టిని ఎంపిక చేసినట్లు సమాచారం. వరుస ఫ్లాప్ లున్నా కృతికి ఇలా అవకాశం రావడం అన్నది అదృష్టమనే చెప్పాలి. అయితే కృతి మంచి పెర్ఫార్మర్. అందం, అభినయం గల నాయిక. తనలో ఆ లక్షణాలతోనే టాలీవుడ్ లో ఇంకా అవకాశాలు అందుకో గల్గుతుంది. అయితే ఈసారి సక్సస్ అన్నది అత్యంత కీలకం. ఫ్లాప్ లు కొనసాగిస్తే ఇకపై అవకాశాలు కష్టం. ఇప్పటికే నాయికల మధ్య తీవ్రమైన పోటీ ఉంది. ఆ పోటీని తట్టుకుని నిలబడటం చిన్న విషయం కాదు. అయితే విశ్వక్ సేన్ సినిమాలు రిలీజ్ సమయంలో నెగిటివ్ గా మారుతున్నాడు. ఆ ప్రభావం సినిమాల పైనా పడుతుంది. ఇటీవల రిలీజ్ అయిన 'లైలా' కంటెంట్ తో ఫెయిలైంది. అంతకు ముందే సినిమాని బోయ్ కాట్ చేయాలన్నది ట్రెండింగ్ లో నిలిచింది. క్షమాపణలు చెప్పినా పనవ్వలేదు. ఈ నేపథ్యంలో తదుపరి సినిమాల విషయంలో విశ్వక్ సేన్ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం అంతే ఉంది.

## ఉస్తాద్ భగత్ సింగ్.. పవన్ రియల్ సీన్!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా థెరి రీమేక్ అనగానే ఫ్యాన్స్ లో కొంత అసంతృప్తి స్టార్ట్ అయ్యింది. కానీ దర్శకుడు హరీష్ మాత్రం మీరు ఊహించని విధంగానే సినిమా మంచి కంటెంట్ తో ఉంటుందని ఎప్పటికప్పుడు ఎలివేషన్స్ అయితే ఇస్తున్నాడు. రీమేక్ లో మంచి అనుభవం ఉన్నప్పటికీ ఫ్యాన్స్ లో టెన్షన్ అయితే తగ్గడం లేదు. అసలే ఇటీవల హిందీ రీమేక్ రెయిడ్ ను మిస్టర్ బచ్చన్ గా తీసి డిజాస్టర్ అందుకున్నాడు. భగత్ సింగ్ ఎలా ఉంటుంది అనేది, అప్డేట్స్ వచ్చే వరకు చెప్పలేని పరిస్థితి. పవన్ సినిమాల్లో ఈ సినిమా కంటే ఎక్కువగా ఓజి సినిమాకే బజ్ ఎక్కువగా ఉంది. మరోవైపు హరిహర వీరమల్లు భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్నప్పటికీ, ప్రమోషన్ లోపంతో కావాల్సినంత హైప్ తీసుకురాలేకపోతోంది. ఈ మూడు చిత్రాల్లో హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ ప్రాజెక్ట్ ప్రాధాన్యత పరంగా చివరిలో ఉన్నా, హరీష్ మాత్రం దీని మీద ప్రత్యేక దృష్టి పెట్టాడు. ఈ సినిమా హరీష్ శంకర్‌కు ఎంతో ముఖ్యమైనది. మిస్టర్ బచ్చన్ సినిమా ఫలితంతో కొంత నిరాశ చెందిన హరీష్, మళ్లీ తానేంటో నిరూపించుకునే అవకాశంగా ఈ సినిమాను చూస్తున్నాడు. కొంతవరకు పవన్ అభిమానుల్లో హరీష్ శంకర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. గబ్బర్ సింగ్ సినిమాతో మెగా ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకున్న హరీష్, ఈసారి మరింత స్టైలిష్‌గా పవన్‌ని చూపించేందుకు సిద్ధమవుతున్నాడు. ఇటీవల జరిగిన రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో హరీష్ శంకర్ ఆసక్తికరమైన లీక్ ఇచ్చాడు. ఎన్నికల సమయంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు, పవన్ కళ్యాణ్ ఓపెన్ టాప్ జీపులో కూర్చున్న స్టిల్ ఇప్పటికి కూడా బెస్ట్ మూమెంట్. ఆయన వెనుక వేలాదిగా అభిమానులు బైకులు, కార్లలో ఫాలో అవుతున్న వీడియో అప్పట్లో వైరల్ అయింది. ఇప్పుడు ఇదే సీన్‌ను ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో కూడా హరీష్ రీ-క్రియేట్ చేస్తున్నట్టు వెల్లడించాడు. అలాంటిది ఒక రీమేక్ సినిమాలో ఎలా ఇమిడుతుందనే సందేహం సహజం. కానీ హరీష్ శంకర్ తన స్టైల్‌కి తగ్గట్టుగా స్క్రిప్ట్‌లో మార్పులు చేసి, పవన్ అభిమానుల్ని థ్రిల్ చేసేలా ప్రెజెంట్ చేయడంలో మాస్టర్. గతంలో గబ్బర్ సింగ్లోనూ అసలు వెర్షన్‌లో లేని అనేక మాస్ ఎలిమెంట్స్‌ని జోడించి, సినిమాను మరింత పవర్‌ఫుల్‌గా మలిచాడు. గద్దలకొండ గణేష్లోనూ అదే ఫార్ములా వర్కౌట్ అయ్యింది. కాబట్టి, ఉస్తాద్ భగత్ సింగ్ లోనూ కొత్త మాస్ ఎలిమెంట్స్ తప్పకుండా ఉండబోతున్నాయని చెబుతున్నారు.అయితే, ఈ సినిమా ఎప్పుడు పూర్తవుతుంది? వచ్చే ఏడాది ఎప్పుడు విడుదల అవుతుంది? అన్నదే ఇప్పుడు ఫ్యాన్స్‌లో పెద్ద ప్రశ్నగా మారింది. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో పూర్తిగా బిజీగా ఉండటంతో, సినిమా షూటింగ్ కాస్త నెమ్మదిగా సాగుతోంది. వచ్చే ఏడాది మిడ్‌లోగానీ, 2026 మొదటి త్రైమాసికంలో గానీ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం





## బ్లాక్ బుకింగ్ స్కామ్‌పై ఓపెనైన టాప్ డైరెక్టర్

టికెట్ బుక్ చేయడానికి బుక్ మై షో లేదా వేరే ఏదైనా ఆన్ లైన్ ప్లాట్ ఫామ్ ని ఆశ్రయించగానే, ముందుగా ముఖ్యమైన సీట్లు అన్నీ బ్లాక్ అయినట్టు చూపిస్తుంది. అవన్నీ ప్రేక్షకులు జెన్యూన్ గా బుక్ చేసినవి కాదు. వాటిని ఏవో కార్పొరేట్ కంపెనీలు బుక్ చేసుకున్నాయి అని ప్రజల్ని భ్రమింపజేయడం. ఈరోజుల్లో ఇలాంటి టెక్నిక్ ని ఫాలో అవ్వని థియేటర్ లేదంటే అతిశయోక్తి లేదు. దీనిపై ఇప్పుడు పెద్ద డిబేట్ కి తెర తీసాడు ప్రముఖ బాలీవుడ్ క్రిటిక్ కోమల్ నహతా. పూర్తి వివరాల్లోకి వెళితే... అక్షయ్ కుమార్ నటించిన 'స్కై ఫోర్స్' విమర్శకుల ప్రశంసలు పొందినా ఆశించిన స్థాయి బాక్సాఫీస్ వసూళ్లను సాధించడంలో తడబడింది. ఈ సినిమా రూ. 100 కోట్ల క్లబ్‌లోకి ప్రవేశించడంతో చిత్రయూనిట్ కొంతమేర ఊపిరి పీల్చుకుంది. కొన్ని వరుస పరాజయాల తర్వాత అక్షయ్‌కి కొంత ఉపశమనం ఇచ్చిన సినిమా ఇది. అయితే అక్షయ్ లాంటి పెద్ద స్టార్ నుంచి ఇంకా భారీ వసూళ్లను ఇండస్ట్రీ ఆశిస్తోంది. సీనియర్ జర్నలిస్ట్, ట్రేడ్ అనలిస్ట్ కోమల్ నహ్తా ఈ చిత్రం బాక్సాఫీస్ నంబర్లను తారుమారు చేయడానికి నిర్మాతలు బుకింగ్‌లను బ్లాక్ చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. విక్కీ కౌశల్ , రష్మిక మందన్న నటించిన 'చావా'పై కూడా ఆయన ఈ ఆరోపణలు చేశారు. రెండు చిత్రాలను మాడాక్ ఫిల్మ్స్ నిర్మించింది. ఈ సంస్థ కోమల్ ఆరోపణలను తిప్పి కొట్టేందుకు ప్రయత్నిస్తోంది. తాజాగా స్కై ఫోర్స్ డైరెక్టర్ సందీప్ కెవ్లానీ జాతీయ మీడియాతో మాట్లాడారు. థియేటర్లలో సినిమా నడిచేప్పుడు అసలు కలెక్షన్ల వివరాలు చెప్పడం ఆపేయాలని అతడు పిలుపునిచ్చారు. కోమల్ నహ్తా గొప్ప సీనియర్ జర్నలిస్ట్ .. నేను అతడిని చాలా గౌరవిస్తానని, ఈ విషయంపై ఆయన మాట్లాడాల్సి వస్తే, ప్రజల ముందు ఆయన ఎవరి పేర్లు చెప్పకూడదు. ఒక సీనియర్ జర్నలిస్ట్ ఒక సినిమాను కించపరచడం ద్వారా ఏదైనా లాభం పొందుతారని నేను అనుకోను. గత 5 సంవత్సరాలలో బ్లాక్ బుకింగ్ (బల్క్ టికెట్ బుకింగ్) లేదా కార్పొరేట్ బుకింగ్‌లు చేసినట్లు అతను భావిస్తే, అలా చేసిన ప్రతి సినిమా పేరును రికార్డెడ్ గా అతడు చెప్పాల్సి ఉంటుంది.. అని వ్యాఖ్యానించారు. చావా లేదా స్కై ఫోర్స్ కలెక్షన్లు నిజాయితీగా వెల్లడించామని .. బ్లాక్ బుకింగ్‌లు జరగలేదని సందీప్ అన్నారు. ఇది ప్రేక్షకుల ప్రేమతో సాధించిన విజయం. స్కై ఫోర్స్ విడుదలై దాదాపు 20 రోజులు అయింది. ఇప్పటికీ సినిమా నచ్చిన ప్రేక్షకులు ట్విట్టర్, ఇన్‌స్టాలో మెసేజ్ లు పంపిస్తున్నారు. సినిమా తెరకెక్కించి ప్రజలకు చేరవేశాక మా పని పూర్తయినట్టే. ఒక సినిమా ఎంత వసూళ్లు చేస్తుందనేది జనం పట్టించుకోరు. అందరికీ ఇష్టమైన చిత్రం మున్నా భాయ్ బాక్సాఫీస్ కలెక్షన్ గురించి నేను అడిగితే మీరు చెప్పగలరా? దీర్ఘకాలంలో సినిమా కలెక్షన్ లను పట్టించుకోరు.. అది ప్రజల హృదయాల్లో ఎంత కాలం ఉంది అన్నదే ముఖ్యం! అని అన్నారు. అంతేకాదు.. సినిమా కలెక్షన్ల గురించి ప్రజలకు చెప్పకూడదని దర్శకరచయిత సందీప్ అన్నారు. కలెక్షన్లు అనేది కేవలం 15 రోజులు లేదా ఒక నెల ఆట. ఆపై అందరూ వాటి గురించి మర్చిపోతారు. కలెక్షన్ల కోసం ఒక వ్యవస్థ ఉండకూడదు. ఒక సినిమా ఎంత సంపాదించిందో మనం ప్రజలకు ఎందుకు చెప్పాలి? ఒక సినిమా ఎక్కువ బిజినెస్ చేస్తేనే అది మంచిదని మనం చెప్పాలా? కలెక్షన్లతో సినిమాకు సంబంధం లేదు. ప్రేక్షకులు సినిమా చూడాలా వద్దా అని నిర్ణయించుకోనివ్వండి. కలెక్షన్ల గురించి చెప్పడం, ట్రేడ్ నిపుణులు ప్రారంభించిన చాలా భిన్నమైన పద్ధతి. కానీ అది మంచి సినిమా అయితే ప్రజలు ఎలాగైనా చూస్తారు. ఒక సినిమా రూ. 300 కోట్లు సంపాదించినా మీకు నచ్చకపోతే అది ఆర్జించిన డబ్బును చూసి మీరు మీ అభిప్రాయాన్ని మార్చుకోరు కదా! అని అన్నారు

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**